### విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :73 నల్గొండ బుధవారం 04-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-


## వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్ కు దరఖాస్తుల ఆహ్వానం



ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్ డబ్ల్యూ తదితర కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్ కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 9వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో 11వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు కావాల్సినవారు ఒక్కో పేపర్ కు రూ. 1000 చొప్పున చెల్లించి ఈ నెల 11వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్.. కారులో చెలరేగిన మంటలు



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని మాదాపూర్ వద్ద సోమవారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం జరిగింది. గచ్చిబౌలి నుంచి మాదాపూర్ వైపు వెళ్తున్న ఓ కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కారు డ్రైవర్, అందులోని ప్రయాణికులు.. క్షణాల్లో బయటకు దిగి తమ ప్రాణాలను కాపాడుకున్నారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదం కారణంగా మాదాపూర్ %-% గచ్చిబౌలి రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అయితే ఇంజిన్లో షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సాగులో ఆధునిక పద్ధతులు అవలంభించాలి : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు, జూన్ 03 : మన కష్టం మనం చేసుకుంటూ ఆత్మగౌరవంతో జీవించేదే వ్యసాయమని, సాగులో ఆధునిక పద్ధతులు అవలంభిస్తూ రైతులు అధిక దిగుబడులు పొందాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండల కేంద్రంలోని రైతు వేదికలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న యువ రైతులకు పంటల సాగు మెలకువలపై ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యువ రైతుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యానవన శాఖ, రైతులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.%అనంతరం ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేస్తూ ఎక్కువ దిగుబడిని సాధిస్తున్న యువ రైతులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సమావేశంలో ఆధునిక పద్ధతులను అనురిస్తూ సాగు చేస్తూ ఆధిక దిగుబడిని,ఆధిక రాబడిని పొందుతున్న యువరైతుల విజయగాథలను ఇతర రైతులకు పరచయం చేశారు. ఉద్యానవన శాఖ సలహాలు, సూచనలతో వ్యవసాయం చేస్తే అధిక రాబడి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ, వ్యవసాయశాఖ అధికారులు, ప్రజా ప్రనిదులు, యువ రైతులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని పాకిస్థాన్ ఆపేయాలి : సీడీఎస్ చౌహాన్



ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్ తీరుపై భారత 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ తీవ్ర విమర్శలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని పాకిస్థాన్ ఆపేయాలని ఆయన డిమాండ్ చేశారు. పహల్గాం దాడి లాంటి ఉగ్రదాడుల ను భారత్ సహించదని స్పష్టం చేశారు. ఉగ్రవాదం పడగ కింద భారత్ ఉండబోదని తేల్చిచెప్పారు. న్యూక్లియర్ బ్లాక్ మెయిల్‌ను భారత్ ఎట్టిపరిస్థితుల్లో సహించబోదని సీడీఎస్ అన్నారు. పాకిస్థాన్.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే తన విధానంగా మార్చుకుందని విమర్శించారు. కాల్పుల విమరణను ముందుగా పాకిస్థానే కోరిందని, కానీ నీరు రక్తం కలిసి పారవని ఆయన వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ తీరు మారాల్సిందేనని చెప్పారు.ఆపరేషన్ సింధూర్ సందర్భంగా చిన్నచిన్న నష్టాలు జరిగాయని సీడీఎస్ అనిల్ చౌహాన్ తెలిపారు. అయితే ఈ నష్టాలు భారత సైన్యంపై పెద్దగా ప్రభావం చూపవని అన్నారు. పొరపాట్లను తాము సరిదిద్దుకుంటామని చెప్పారు. అయినా ఇలాంటి సందర్భాల్లో జరిగిన నష్టం కంటే సాధించిన విజయాన్నే చూడాలని సూచించారు.

## ఎఫ్‌టీఎల్ స్థలాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు



కుత్బుల్లాపూర్, జూన్ 3 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గుండ్ల పోచంపల్లి శివారు ప్రాంతంలో లింగం చెరువుకు ఆనుకొని ఉన్న బఫర్ జోన్‌లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను మంగళవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఫిర్యాదులు అందిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించిన అనంతరం ఎఫ్టీఎల్ కు దూరంలో నిర్మాణాలు జరుగుతున్నాయని, ఎలాంటి పరిస్థితుల్లో చెరువు బఫర్ జోన్ లో నిర్మాణాలు పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులతో పాటు ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీ పోలీసులను నిలదీసిన వైఎస్ జగన్



ఏపీలోని గుంటూరు జిల్లా తెనాలిలో నడిరోడ్డుపై ముగ్గురు యువకులను పోలీసులు చితకబాదిన ఘటనపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. గంజాయి మత్తులో దాడికి ప్రయత్నించారని వారిపై తప్పుడు కేసులు పెట్టి నడిరోడ్డుపై చితకబాదడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులు ఎవరి మీద అయినా ఉండొచ్చని.. ఆ వ్యవహారాన్ని కోర్టులు చూసుకుంటాయని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబుపై 24 కేసులు ఉన్నాయని.. అలా అని నడిరోడ్డు మీదకు తీసుకొచ్చి తన్నడం ధర్మమేనా? పోలీసులే చట్టాన్ని ఉల్లంఘిస్తారా? ఇలా చేసే నైతికత పోలీసులకు ఉందా అని ప్రశ్నించారు. పరువు ప్రతిష్టలను తీకే హక్కు పోలీసులకు ఉందా అని నిలదీశారు. నడిరోడ్డుపై కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని అడిగారు. %తెనాలిలో నడిరోడ్డుపై పోలీసుల చేతిలో హింసకు గురైన యువకుల కుటుంబాలను జగన్ పరామర్శించారు. వారి కుటుంబాలను ఓదార్చారు. వైసీపీ తరపున వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రం అప్పుల పాలైందని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ దిగజారిపోయిందని విమర్శించారు. పోలీసుల వికృత రూపానికి తెనాలి ఘటనే సాక్ష్యమని అన్నారు.తెనాలి పోలీసుల చేతిలో ముగ్గురు యువకులు దెబ్బలు తిన్నారని.. వారిలో రాకేశ్ హైదరాబాద్‌లో జొమాటో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడని జగన్ అన్నారు. ఆ యువకుడు తెనాలిలోనే ఉండటం లేదని.. పాత కేసులో వాయిదా కోసం తెనాలికి వచ్చాడని చెప్పారు. రాకేశ్‌ను చూడటానికి మంగళగిరి నుంచి అతని స్నేహితులు వచ్చారని తెలిపారు. వీరిలో జాన్ విక్టర్ జూనియర్ అడ్వకేట్ అని.. అతనికి బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం కూడా ఉందని తెలిపారు. ఐతా నగర్‌లో సివిల్ డ్రెస్‌లో ఉన్న ఓ కానిస్టేబుల్ ఎవరితోనో గొడవ పడుతుంటే సదరు యువకులు అడ్డుకున్నారని చెప్పారు. కేవలం కానిస్టేబుల్‌ను ప్రశ్నించడవే వీరు చేసిన తప్పా అని నిలదీశారు.ఏప్రిల్ 24వ తేదీని కానిస్టేబుల్‌ను ముగ్గురు యువకులు ప్రశ్నించారని.. 25వ తేదీన పోలీసులు మంగళగిరి వెళ్లి జాన్ విక్టర్, కరీముల్లాను కొట్టుకుంటే తీసుకొచ్చారని, తెనాలి పోలీస్ స్టేషన్‌లో కూడా పడేసి కొట్టారని అన్నారు. ఏప్రిల్ 26వ తేదీన ఐతా నగర్‌లో నడిరోడ్డుపై పడేసి ముగ్గురిని చితకబాదారని తెలిపారు. కొట్టవద్దని వేడుకున్నా కానీ పోలీసులు వదల్లేదని పేర్కొన్నారు. విక్టర్ జేబులో పోలీసులే కత్తి పెట్టారని.. ఈ వ్యవహారంలో తెనాలి టూటౌన్ సీఐ, మరో సీఐ కూడా ఉన్నారని ఆరోపించారు. నిజంగా వాళ్లు తప్పు చేసి ఉంటే.. అరెస్టు చేసిన వారిని సకాలంలో కోర్టు ముందు ఎందుకు ప్రవేశపెట్టలేదని జగన్ ప్రశ్నించారు. ఇది చట్టాన్ని ఉల్లంఘించడం కాదా అని నిలదీశారు. ఈ ఘటన జరిగిన తర్వాతే ముగ్గురి మీద రౌడీషీట్ తెరిచారని.. దీన్ని బట్టే పోలీసులు ఎంత దుర్మార్గంగా వ్యహరించారనేది అర్థమవుతుందని అన్నారు.

## గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు.. 40 మంది పాలస్తీనియన్ల మృతి



గాజా లో ఇజ్రాయెల్ మారణహెూమాన్నిసృష్టిస్తోంది. గాజాలోని పలు ప్రాంతాలపై భీకర దాడులకు పాల్పడుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్‌కు వెళ్లకుండానే మధ్యప్రాచ్య పర్యటనను ముగించిన తర్వాత ఐడీఎఫ్ తమ దాడులకు మరింత తీవ్రతరం చేసింది. గాజాలోని నివాస ప్రాంతాలు, ఆసుపత్రులపై విరుచుకుపడుతోంది. గత 24 గంటల్లో గాజా అంతటా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 40 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దాదాపు 208 మంది గాయపడినట్లు పేర్కొంది.

%కాగా, గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం మొదలైన విషయం తెలిసిందే. ఈ గాజా పోరు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రాణాలు కోల్పోయిన పాలస్తీనియన్ల సంఖ్య 50 వేలు దాటింది. ఈ యుద్ధంలో 54,510 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. సుమారు 1,24,901 మంది గాయపడినట్లు పేర్కొంది. హమాస్‌ను అంతమొందించి ఆ ఉగ్రసంస్థ చెరలో ఉన్న బందీలను విడుదల చేయడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ సేనలు తెలిపాయి.

గాజాస్ట్రిప్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు ఇటీవలే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. గాజాస్ట్రిప్‌ను సంపూర్ణంగా స్వాధీనం చేసుకునే వరకు ఇజ్రాయిల్ వెనుకడుగు వేయబోదన్నారు. గాజాస్ట్రిప్ వద్ద భీకర పోరు సాగుతోందని, దాంట్లో ప్రగతి సాధిస్తున్నట్లు ఆయన చెప్పారు. గాజాస్ట్రిప్ ఏరియాను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటామన్నారు. విజయం సాధించాలంటే ఆ దిశగానే ప్రయత్నాలు సాగించాల్సి ఉంటుందన్నారు.

## సంజయ్ రౌత్ ఉండగా ఉద్ధవ్‌కు వేరే రాజకీయ శత్రువులు అక్కర్లేదు..!



ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన ఎంపీసంజయ్ రౌత్ పై బీజేపీ సీనియర్ నాయకుడు, మహారాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి గిరీష్ మహాజన్ తీవ్ర విమర్శలు చేశారు. సంజయ్ రౌత్ ఒక బ్రోకర్ అని, ఆయన ఉండగా ఉద్ధవ్ థాకరేకు వేరే రాజకీయ శత్రువులు అక్కర్లేదని వ్యాఖ్యానించారు. సంజయ్ రౌత్ శివసేన పార్టీని నాశనం చేస్తున్నారని ఆరోపించారు.%పార్టీ కోసం ఎంతో కష్టపడిన నాయకులను, ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలను సంజయ్ రౌత్ దూరం చేస్తున్నారని గిరీష్ మహాజన్ విమర్శించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత శివసేనను బీజేపీకి దూరం చేసి శరద్‌పవార్‌తో, కాంగ్రెస్‌తో కలిసేలా చేసింది సంజయ్ రౌతేనని ఆయన ఆరోపించారు. అప్పుడే శివసేన పతనం మొదలైందన్నారు.అయితే ఎన్డీఏ కూటమి అధికారం కోల్పోతే బీజేపీని ఎడారిగా మార్చే నాయకుల్లో మంత్రి గిరీష్ మహారాజ్ ముందుంటారని ఇటీవల సంజయ్ రౌత్ ఆరోపించారు. దాంతో రౌత్‌కు కౌంటర్‌గా గిరీష్ తాజా వ్యాఖ్యలు చేశారు. రౌత్ శివసేనను నాశనం చేసినట్లు తాను చేయబోనని అన్నారు. తాను 20 ఏళ్లపాటు ప్రతిపక్షంలో ఉన్నా పార్టీని వీడలేదని చెప్పారు.

## ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను తొలగించిన జమ్ము కశ్మీర్ ప్రభుత్వం

పాక్ కోసం గూఢచర్యం వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు భారతీయులు అరెస్టైన విషయం తెలిసిందే. తాజాగా ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్న పలువురు ప్రభుత్వ ఉద్యోగుల పై జమ్ము కశ్మీర్ ప్రభుత్వం వేటు వేసింది.

%పోలీస్ కానిస్టేబుల్ ఇష్ఫాక్ నసీర్, స్కూల్ టీచర్ అజాజ్ అహ్మద్ , ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ వసీమ్ అహ్మద్‌ఖాన్.. ఈ ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను విధుల నుంచి తొలగించింది. ఈ మేరకు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ముగ్గురు ఉద్యోగులకు లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు తేలడంతో చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు ఉగ్రవాదులకు సరకులు అందజేయడం, ఆయుధాల స్మగ్లింగ్, భద్రతా దళాలకు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలకు సాయం చేయడం వంటివి చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ ముగ్గురుని అధికారులు జైలుకు తరలించారు.ఇష్ఫాక్ నసీర్.. 2007లో రాష్ట్ర పోలీసు శాఖలో చేరాడు. అతని సోదరుడు ఆసిఫ్ నసీర్ 2019లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. అతను పాక్‌లో శిక్షణ పొందిన లష్కరే తోయిబా ఉగ్రవాది. ఆయుధాల అక్రమ రవాణా కేసు దర్యాప్తు సందర్భంగా అతని ఉగ్రవాద సంబంధాలు బయటపడ్డాయి. అతని మరణంతో ఇష్ఫాక్ నసీర్ ఉగ్రకార్యకలాపాలను కొనసాగించాడు. లష్కరే తోయిబాకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలు సరఫరాకు సాయం చేసేవాడు.అజాజ్ అహ్మద్.. 2011లో విద్యాశాఖలో టీచర్‌గా ఉద్యోగంలో చేరాడు. అతడికి హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్ర సంస్థతో సంబంధాలు ఉన్నాయి. కశ్మీర్‌లోని పూంచ్ ప్రాంతంలో చురుగ్గా పనిచేస్తూ ఉగ్రవాదులకు ఆయుధాలు, మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేసేందుకు సాయం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2023లో పోలీసులు నిర్వహించిన సాధారణ తనిఖీల్లో అతడు, అతడి మిత్రుడు దొరికిపోయారు. అతడికి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని హిజ్బుల్ హ్యాండ్లర్ నుంచి ఆయుధాలు వచ్చినట్లు గుర్తించారు. వాటిని డెలివరీ చేసేందుకు వెళుతుండగా.. పోలీసులు పట్టుకున్నారు. అతని నుండి హిజ్బుల్ పోస్టర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.వసీమ్ అహ్మద్ ఖాన్.. 2007లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చేరాడు. ప్రస్తుతం అతను శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు లష్కరే, హిజ్బుల్ ఉగ్ర సంస్థల కోసం పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అతడికి ఉగ్రవాద సంబంధాలు ఉన్నట్లు 2018లో ఆగస్టులో బయటపడింది. శ్రీనగర్‌లోని బట్‌మాలూ వద్ద ఉగ్రదాడిపై విచారణ సమయంలో ఇతడిని తొలిసారి అరెస్ట్ చేశారు. జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించిన జర్నలిస్ట్ సుజాత్ బుఖారీ, అతని ఇద్దరు గార్డుల హత్యకు కుట్రలో ఇతడి హస్తం ఉంది. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఘటనా స్థలం నుంచి తప్పించేందుకు ఇతడే సాయం చేసినట్లు గుర్తించారు.

## 2025 - నీట్-యూజీ పరీక్ష ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదల



2025 - వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదలైంది. ఈ ఆన్సర్ కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం విడుదల చేసింది. నీట్ యూజీ 2025 పరీక్ష రాసిన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ https://neet.nta.nic.in/ ద్వారా తమ ఆన్సర్ కీ, రెస్పాన్స్ షీట్ , ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

%అలాగే.. ఈ ప్రొవిజినల్ ఆన్సర్ కీలోని ఏదైనా సమాధానంపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని ఎన్‌టీఏ సూచించింది. ఇందుకోసం ఒక్కో ప్రశ్నకు రూ.200 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. నేటి నుంచి జూన్ 5వ తేదీ అర్ధరాత్రి 11:50 గంటలలోగా ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను తెలియజేయవచ్చు. విద్యార్థులు లేవనెత్తిన అభ్యంతరాలను సబ్జెక్టు నిపుణుల ప్యానల్ సమీక్షించనుంది. ఈ నెలలో ఫైనల్ ఆన్సర్ కీతో పాటు ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది. అనంతరం నీట్ యూజీ 2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలకానుంది. మే 4వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ పరీక్షకు 20.8 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. 5,400కు పైగా కేంద్రాల్లో పటిష్ఠ భద్రత మధ్య ఈ పరీక్షను నిర్వహించారు. విదేశాల్లోని 14 కేంద్రాల్లోనూ నీట్ యూజీ పరీక్ష జరిగింది.

## సంపాదకీయం

**బుధవారం 04-06-2025**

# గ్రీష్మవర్షం...

దేవుడికేం హాయిగ ఉన్నాడూ, మానవుడే బాధలు పడుతున్నాడూ' అంటాడో సినీకవి. అనాదిగా జరుగుతున్నదీ, మనం అంతగా గమనించనిదీ ఏమిటంటే, ఈ చరాచర జగత్తు మొత్తానికి మనిషి తనే కేంద్రస్థానమనుకుంటాడుబీ ఈ విశ్వరచన అంతా తన కోసమేననీ, తనే సృష్టిచక్రం తిప్పు తున్నాననే భ్రమలోకి జారిపోతూ ఉంటాడు, తన బాధ ప్రపంచ బాధగా ఊహించుకుంటాడు. నిజానికి మనిషే కాదు, ప్రతి జంతువూ, చెట్టూ, పిట్టా కూడా అలాగే అనుకుంటాయేమో కూడా!కానీ కొంచెం సూక్ష్మంగా యోచిస్తే, దేవుడూ, లేదా ప్రకృతీ కూడా అంత హాయిగా ఏమీలేనట్టూ, తమవైన బాధలను, సమస్యలను ఎదుర్కొంటూనే ఉన్నట్టూ అర్థమవుతుంది. మనం దేవతగా భావించే భూమినే తీసుకుంటే, తన వందల కోట్ల సంవత్సరాల ఉనికిలో అదెన్ని బాధలు పడిందో, ఎన్నెన్ని అస్తిత్వ సమస్యల నెదుర్కొందో, ఎంతటి అస్థిరత్వానికి, అనిశ్చితికి గురైందో భూభౌతిక విజ్ఞానం మనకెంతో కొంత అవగాహన కలిగిస్తూనే ఉంది. మొదట భూమి మొత్తం మండిపోయే ఓ అగ్నిగోళం. క్రమంగా ఉపరితలం చల్లబడుతూ వచ్చింది. అయినా ఇప్పటికీ లోపల, తాపమానం మీద వందల, వేల డిగ్రీల మేరకు సెగలూ, పొగలూ కక్కుతూనే ఉందంటారు. ఆ పైన లక్షల సంవత్సరాల నిడివిగల మంచుయుగాలు, జలప్రళయాలు, అగ్నిపర్వత విస్ఫోటాలు, అంతర్గత ప్రకంపనాలతో అతలాకుతలమవుతూనే వచ్చింది. అప్పుడు తను కూడా మనిషిలానే, తనకన్నా పైన ఉన్న ఏ తీవ్రశక్తినో ఉద్దేశించి, 'దేవుడికేం హాయిగ ఉన్నా'డని పాడుకునే ఉంటుందేమో! మరీముఖ్యంగా తన ప్రకృతి గమనానికి సంబంధించి భూమి తనదైన ఓ ఋతుభ్రమణాన్ని నిర్దేశించుకుని అదే స్థిరమూ, శాశ్వతమూ అని కూడా భ్రమిస్తూ ఉండచ్చు. ఇక్కడే మనిషికీ, భూమికీ మరో పోలిక. మనిషి కూడా తనదైన ఓ ఋతుచక్రాన్ని కల్పించుకుని, దానినో కాలచక్రంలో బంధించాననుకుంటాడు. తను కోరుకున్నట్టే అవి తిరుగుతూ ఉంటాయనుకుంటాడు. కానీ, తన పైనున్న శక్తులు తను నిర్దేశించుకున్న ఋతుభ్రమణాన్ని తలకిందులు చేయగలవన్న ఎరుక భూమికి తరచు తప్పినట్టే, ప్రకృతి తన ఋతుచక్రాన్ని వెనక్కి తిప్పగలదన్న ఎరుక మనిషికీ తప్పుతుంది. అసలు ప్రకృతీ, తనూ అనుసరించే ఋతుకాల సూచికలు ఒకటే కావాల్సిన అవసరం లేదన్న గ్రహింపూ మనిషికి లోపిస్తూ ఉంటుంది. ఇంతకీ సంగతేమిటంటే, ఈ ఏడాది దేశంలోని పలు ప్రాంతాలు గ్రీష్మతాపాన్ని చవిచూడకుండానే వర్షర్తువు చొరబడిపోయింది. ఆ విధంగా గ్రీష్మానికి, వర్షర్తువుకు మనం నిర్దేశించుకున్న కాలిక మైన హద్దుల్ని ప్రకృతి మరోసారి చెరిపేసింది. దాంతో వాతావరణ, పర్యావరణ శాస్త్రవేత్తలు రంగంలోకి దిగిపోయి వర్షపాతానికి సంబంధించిన చారిత్రకమైన గణాంకాలు, ఇతర వివరాల కవిలె కట్టల్ని బయటికి తీసి శోధించడం ప్రారంభించారు. కేరళనే తీసుకుంటే, నైరుతి ఋతుపవనాలు 1975, 1990 తర్వాత మళ్ళీ ఇప్పుడే అక్కడికి వారం రోజుల ముందు అడుగుపెట్టాయంటున్నారు. దేశం ఇతర ప్రాంతాలలో ఇలా జరగడం 2009 తర్వాత మళ్ళీ ఇప్పుడేనంటున్నారు. ఆ పైన ఈసారి కేరళతోపాటు, తమిళనాడులోనూ, కర్ణాటక, మహారాష్ట్రలలోని అత్యధిక ప్రాంతాలలోనూ నైరుతి ఋతుపవనాలు మామూలు గడువుకన్నా ముందు రావడమే కాకుండాబీ ఒకే రోజున ఒకేసారి పెద్ద ఎత్తున ముంచెత్తడాన్ని విశేషంగా చూపుతూ, ఇలా జరగడం 1971 తర్వాత ఇదే మొదటిసారి అంటున్నారు. మళ్ళీ ఇంకోవైపునుంచి చూస్తే, 1970లనుంచీ ఒక పద్ధతి ప్రకారం ఋతుపవనాల రాకలో ఆలస్యం జరుగుతోందంటున్నారు. మొత్తంమీద సంవత్సరాల వారీగా వర్షర్తువు చరిత్రనైతే నమోదు చేయగలుగుతున్నా, అది ఒక్కోసారి గడువు కన్నాముందే ఎందుకు తొలకరించి పలకరిస్తుందో, ఒక్కోసారి ఎందుకు వేళతప్పిన అతిథి అవుతుందో ఇప్పటికీ కారణాలు అంతుబట్టక శాస్త్రవేత్తలు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. అలాగని వాతావరణ, పర్యావరణ రంగాల్లో వైజ్ఞానికంగా మనం వేసిన అంగలు చిన్నవేమీ కావు. వర్షాలు ఎందుకు పడతాయో, ఎందుకు పడవో మనకిప్పుడు బాగా తెలుసు. నేలమీది శీతోష్ణాలు, సముద్రాలమీది శీతోష్ణాలు చెట్టపట్టాలు వేసుకుని విడతలవారీగా అల్పపీడనాలను సృష్టిస్తూ వర్షపాతానికి ఎలా కారణమవుతాయోబీ మారిషస్, మడగాస్కర్ల సమీపంలో పుట్టుకొచ్చే సోమాలీ నిమ్నవాయువులూ, పసిఫిక్ గాలులూ అరేబియా సముద్రం, బంగాళాఖాతాల దాకా వ్యాపించి మన గడ్డమీద వర్షాలకు, లేదా వర్షాభావాలకూ కూడా ఎలా దోహదం చేస్తాయో, ప్రత్యేకించి హిమాలయాలు మన దగ్గర వర్షసామ్రాజ్యాన్ని ఎలా శాసిస్తున్నాయో మనకిప్పుడు మరింత స్పష్టంగా తెలుసు. అసాధారణ ఉపరితల ఉష్ణోగ్రతలను సంకేతించే 'ఎల్ నినో', అంతే అసాధారణ శీతలత్వాన్ని సూచించే 'లా నినా' అనే వాతావరణ ధోరణులకూ %-% వర్షాల రాకడకూ, పోకడకూ, ఇతర పరిణామాలకూ ఉన్న సంబంధం గురించిన అవగాహన కూడా మనకుంది. అయినాసరే, గడువుకు ముందే వర్షాలు, వర్షాభావాలూ, వర్షాలస్యాల వెనుక ప్రకృతి అనుసరించే సూత్రబద్ధత ఏమిటో ఇప్పటికీ అంతుబట్టని బ్రహ్మపదార్థంగానే ఉంది. మనకు సరే, ప్రకృతికి మాత్రం అది అంతుబట్టిందా అన్నది అంతిమ ప్రశ్న. అదలా ఉంచితే, ముందుస్తు వర్షాలు రేపటి ఆశల విరిజల్లులను తలపించి సంతోషభరితం చేస్తాయి కానీ, దురదృష్టవశాత్తూ ప్రతిసారి అవి వర్షపుష్కలత్వానికి హామీ ఇవ్వకపోవచ్చని శాస్త్రవేత్తలు పెదవి విరుస్తున్నారు. వారి భయాలు నిజం కాకూడదని మనసారా కోరుకుందాం.

# ఏపీలో ఉద్యోగుల బదిలీల ముగింపు వేళ ప్రభుత్వం అనూహ్య నిర్ణయం..!!



అమరావతి,ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల బదిలీల గడువు ముగుస్తున్న వేళ అనూహ్య నిర్ణయం వెల్లడించింది. గత నెల 15వ నుంచి జూన్ 2వ తేదీ వరకు బదిలీలకు ఆర్థికశాఖ అనుమతిచ్చింది. ఆ గడువు జూన్ 2తో ముగుస్తుండటంతో తాజాగా మరో వారం రోజులు పొడిగించారు. ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించారు. ఈమేరకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. జూన్ 10వ తేదీ నుంచి మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది.ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల బదిలీల గడువును పొడిగించింది. గత నెల 15వ తేదీన ఉద్యోగుల బదిలీల పై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఈ రోజు (జూన్ 2) వరకు తొలుత ప్రభుత్వం ఉద్యోగుల బదిలీల కు అవకాశం కల్పించింది. కాగా, ఇప్పుడు ఈ గడువును ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించారు. ఇందుకనుగుణంగా అప్పటి వరకు బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. ఆయా శాఖల బదిలీల్లో అర్హతలపై ఇప్పటికే మార్గదర్శకాలను ఏపీ ప్రభుత్వం జారీ చేసింది. బదిలీల గడువును పెంచాలని ప్రభుత్వానికి ఇప్పటికే ఉద్యోగ సంఘాల నేతలు విన్నవించారు. మరో ఏడు రోజుల పాటు బదిలీలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. కాగా, కొన్ని శాఖల్లో బదిలీ ప్రక్రియలో జాప్యంతో పాటుగా ఉద్యోగుల నుంచి వస్తున్న వినతుల మేరకు ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.బదిలీలకు సంబంధించిన నిబంధనల పైన ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. ఉద్యోగులు ఒకే చోట ఐదేళ్లు పూర్తి అయితే ఖచ్చితంగా బదిలీ చేయాలని సూచించింది. అదే విధంగా ఒకే పదో న్నతి పొంది ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పూర్తి చేసిన వారిని బదిలీ చేస్తున్నారు. ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న ఉద్యోగులకు వ్యక్తిగత విన్నపం మేరకు బదిలీలపై ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. వచ్చే ఏడాది మే 31వ తేదీలోపు రిటైర్మెంట్ అయ్యే ఉద్యోగులకు బదిలీ నుంచి మినహాయింపు ఇస్తూ మార్గదర్శకాల్లో స్పష్టత ఇచ్చింది. అంధులైన ఉద్యోగులకు బదిలీల్లో ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించింది. మానసిక రుగ్మత ఉన్న పిల్లల తల్లిదండ్రులకు వినతి మేరకు బదిలీల్లో ప్రాధాన్యం ఇచ్చింది. మెడికల్ గ్రౌండ్‌లో భాగంగా ఉద్యోగుల వినతి మేరకు బదిలీ చేయనుంది. వితంతు ఉద్యోగుల వినతి మేరకు బదిలీల్లో ప్రాధాన్యం ఇచ్చింది. స్పౌజ్ ఉద్యోగులకు బదిలీల్లో ఒకే చోట లేదా దగ్గరి ప్రాంతాల్లో బదిలీ చేసేలా ప్రాధాన్యం కల్పించింది.

# కాషాయ నీడల్లో ప్రాంతీయ నేతలు?



హైదరాబాద్,బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ కుమార్తె కవిత తమ పార్టీని బీజేపీలో విలీనం చేయడానికి కుట్ర జరిగిందని వెల్లడించడం సంచలనం కలిగించింది. రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగంలో లోపాలోపాల గురించి, పార్టీ రాజకీయ విధానం గురించీ తన అభిప్రాయాలు చెప్పడానికి అధ్యక్షుడు కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ చేశారంటూ కవిత బహిరంగంగానే తిరుగుబాటు ప్రకటించారు. ఆ క్రమంలో లేఖలో రాసిన దాన్ని మించి సంచలన విషయాలు చెప్పి షాక్ ఇచ్చారు. బీజేపీతో విలీనానికి పార్టీలో కీలక వ్యక్తులు కుట్ర పన్నారనే ఆరోపణ వాటిలో అతి తీవ్రమైంది. లిక్కర్ కుంభకోణంలో తాను జైలులో ఉన్నప్పుడే ఈ విషయం దృష్టికి వచ్చిందని, తను అడ్డుకున్నానని ఆమె చెబుతున్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్, బీజేపీపై ఎలాంటి రాజకీయ విమర్శలు చేయకపోవడం, రెండు నిముషాలు మాత్రమే దానిపై చెప్పి కాంగ్రెస్ ఏకైక విలన్ అని ప్రకటించడం ముందే సందేహాలు పెంచింది. మునుగోడు ఉపఎన్నికకు ముందు బీజేపీ మత రాజకీయాల పైన, మోడీ నిరంకుశత్వం పైన నిప్పులు జరిగిన కేసీఆర్ ఎందుకు ఇంతగా మారిపోయారు? ఎన్నికల ముందు కనిపించిన ఈ మార్పు ఓటమి తర్వాత మరింత తీవ్ర రూపం దాల్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ ఒక స్థానం కూడా తెచ్చుకోకపోగా బీజేపీ 8 సీట్లు తెచ్చుకోగలిగింది. తమ ఓట్లను బదలాయించడం వల్లనే బీజేపీకి సహకరించారనే ఆరోపణను ఎదుర్కొన్నది. శాసనమండలి ఎన్నికల్లోనూ బీజేపీతో బీఆర్ఎస్ పోటీ పడకపోవడం బీజేపీకి మేలు చేసింది. ఈ పూర్వరంగంలో కేసీఆర్ రజతోత్సవ సభలో బీజేపీపై రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడటం ఈ ఆరోపణలకు బలం చేకూర్చిందని కవిత విమర్శించారు. ఈ అంశం పార్టీ అధినేత దృష్టికి తీసుకురావడానికి తాను రాసిన అంతర్గత లేఖను లీవ్ చేయడం కూడా కుట్రలో భాగమని ఆమె ధ్వజమెత్తారు. కేసీఆర్ దేవుడేనని కానీ చుట్టూ దయాలున్నాయని తీవ్రభాషలో మాట్లాడారు.దేవుడూ, దయ్యాలూకవిత వ్యాఖ్యలు కొత్త ప్రశ్నలు తీసుకువచ్చాయి . దేవుడైన కేసీఆర్ దయ్యాలను ఎందుకు చుట్టు పెట్టుకున్నారు? ఆ దయ్యాలు దేవుడు కంటే శక్తివంతమైనవా? ఇంతకు ఎవరు ఆ దయ్యాలు? బీఆర్ఎస్ ప్రధమ కుటుంబ సన్నిహితులైతే కవిత దాడి యావత్తు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న అన్న కేటీఆర్‌పైనే ఉద్దేశం ఎక్కువ పెట్టబడిందని స్పష్టం చేస్తున్నారు. కేటీఆర్ హరీశ్‌రావుల మధ్య వైరుధ్యాల గురించి చాలా ప్రచారం జరుగుతూ వచ్చింది. కానీ వాస్తవానికి అన్నాచెల్లెళ్ల మధ్య ఎక్కువ వైరుధ్యం ఉంటుందని, ఉందని ఎప్పుడూ వింటున్న మాటే. ఏదైనా కుటుంబం ప్రాబల్యం కలిగిన ప్రాంతీయ పార్టీల్లో ఇలాంటివి సర్వసాధారణం. కవితను కేసుల నుంచి కాపాడుకోవడానికి కేసీఆర్ బీజేపీ పట్ల మెతక వైఖరి అనుసరిస్తున్నారని ఒక దశలో చాలామంది అభిప్రాయంగా ఉండేది. అయితే ఇప్పుడు ఆమే ఆ అంశాన్ని ప్రశ్నించటం కొత్త మలుపునకు దారి తీసింది. అయితే కవిత మాటలు చేతలు కూడా బీజేపీకి వ్యతిరేకంగా నడిచింది ఈ మధ్య కాలంలో పెద్దగా చూడలేదు. ఇప్పుడు కూడా బీజేపీతో కలిస్తే లిక్కర్ వ్యవహారంలో తను దోషినని ఒప్పుకున్నట్టు అవుతుందని ఆమె వాదన చేస్తున్నారు. రాజకీయంగా దాని మతతత్వం, కేంద్ర నిరంకుశత్వం, తెలంగాణకు అన్యాయం వంటి అంశాలు ప్రధానంగా ముందుకు తేవడం లేదు. లేఖ లీక్ తర్వాత కూడా బీజేపీ విధానాలపై పాలనపై ఆమె పెద్దగా విమర్శిం చింది లేదు. ఆపరేషన్ కగార్‌ను కేసీఆర్ వ్యతిరేకించటం గొప్ప ప్రజాస్వామిక చర్య గనుక ఆ పేరుతో ఆయన తప్పిదాలను పక్కనపెట్టి మళ్లీ బీఆర్ఎస్‌ను బలోపేతం చేద్దాం అన్నది. గత కొంతమంది మద్దతు దారుల, మేధావి వర్గాల నుంచి వినిపిస్తున్న వాదన, ఎన్‌కౌంటర్ల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం కూడా ముద్దాయిగానే ఉంది. పైగా మొన్నటి సభలో ఆయన కేంద్రాన్నిగానీ, హోం మంత్రి అమిత్‌షాను కానీ ప్రత్యేకించి ప్రస్తావించింది లేదు. అటువంటప్పుడు ఈ ఒక్క అంశం ఆధారంగా తీసుకొని కేసీఆర్‌కు బీఆర్ఎస్‌కు వంత పాడటం సరైనదే అవుతుందా? ఇప్పుడు కవిత కూడా కగార్ కేంద్రం బాధ్యత అంటున్నారు కానీ ఇతర అంశాలు ఇప్పటివరకు ప్రస్తావించలేదు. సామాజిక న్యాయం అన్న నినాదంతో ఆమె ఈ ప్రత్యేక ప్రయాణం ప్రారంభించినట్లు కనిపిస్తుంది. కగారు పేరుతో కేసీఆర్‌ను బలపరిచినట్టే సామాజిక న్యాయం అంటున్నారు కనుక కవితను బలపరచాలని ఒక వర్గం వాదనగా ఉంది. మొదట ఆమె తెలంగాణలో చాలా ఏండ్లుగా సామాజిక న్యాయం జరగలేదని అన్నప్పుడు కేసీఆర్‌ను కూడా విమర్శించినట్టు వ్యాఖ్యలు వచ్చాయి. అయితే ఆయనను మినహాయిస్తున్నట్లు ఆమె చూచాయగా తర్వాత మాట్లాడారు. మరోవైపు ఈ నినాదంతో ఆమె కొంతమంది రాజకీయ పార్టీల నేతలను కూడా కలిసి సహాయం అభ్యర్థించారు. ఈ అంశాలు సరైనవైనా మొత్తం రాజకీయ విధానం కవిత అంతర్గత కుటుంబ వివాదం ఏమైనప్పటికీ రాజకీయంగా ఇంకా స్పష్టత రావాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆమెకు మద్దతు ఏ స్థాయిలో ఉంటుందనేది ఆచరణలో చూడాలి. ఇప్పటికైతే తాను వేరే పార్టీ పెట్టడం లేదని కేసీఆర్ నాయకత్వాన్ని బీఆర్ఎస్‌ను కాపాడుకోవడమే ముఖ్యమని ఆమె చెబుతున్నారు. ఏమైనా ఈ మొత్తం వ్యవహారంపై కేసీఆర్ వివరణ ఇవ్వవలసి ఉంటుంది.

### విశ్వసనీయతకు విఘాతం

కేసీఆర్ ఆదేశిస్తే కేటీఆర్ నాయకత్వానికి పని చేస్తానని హరీశ్‌రావు ఈమధ్య చెప్పడంతో కొంతకాలం చర్చ సాగింది. అదే సమయంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగానే ఘనంగా రాజకీయ జీవితం విరమించాలని హరీశ్‌రావు అంతర్గత సమావేశంలో చెప్పినట్టు కేసీఆర్ సన్నిహితులు బహిరంగంగానే ప్రకటించారు. రజతోత్సవ సభలో హరీశ్‌రావును దూరం పెట్టడం, కవితకు ప్రాధాన్యత లేకపోవడం రాజకీయ కారణాల వల్లే జరిగిందని కూడా ఇప్పుడు అర్థమవుతుంది.. అంతర్గతంగా ఈ మల్ల గుల్లాలు బీఆర్ఎస్ అధినేత ఎలా ముగిస్తారు అన్నది ఆయన తీసుకునే రాజకీయ వైఖరి ద్వారానే తేలుతుంది. ఇంత వివాదం తర్వాత కూడా కేసీఆర్ గనక బీజేపీ పట్ల మెతక వైఖరితో ఇతరులపైనే దాడి కొనసాగించేట్లయితే అప్పుడు విశ్వసనీయత కోల్పోవడం అనివార్యమవుతుంది. కవిత బీజేపీతో చెలిమి వద్దంటున్నప్పటికీ ఈ వివాదం ద్వారా బీఆర్ఎస్‌ను బలపరచడం, బలహీనపరచడం వారికే మేలు చేస్తుందన్న వ్యాఖ్య కూడా వినిపిస్తోంది/ ప్రస్తుతానికి కేటీఆర్ చొరవకు పగ్గాలు తప్పనిసరి అనిపిస్తుంది కావచ్చు. హరీశ్‌రావు వరకు కాళేశ్వరం అవకతవకలపై కమిషన్ ముందు హాజరు గురించి ఎక్కువగా చర్చలు చేస్తున్నారని సమాచారం. కవితకు ప్రోద్బలం కాంగ్రెస్ నుంచి వచ్చిందని ఒక పత్రిక ఇచ్చిన కథనాలను ఆమె ఖండిస్తున్నా ఆ పార్టీ మాత్రం ఈ వివాదాన్ని వినోదంగా ఆస్వాదిస్తున్నది. అలాగే బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఈ విషయంలో అత్యుత్సాహంతో చేస్తున్న వ్యాఖ్యలు, చెబుతున్న జోస్యాలు కూడా వివాదాస్పదమయ్యాయి. టీ బీజేపీ అధ్యక్షుడైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉత్తమ పార్టీ వారు అతిగా స్పందించవద్దని హెచ్చరించాల్సి వచ్చింది. నిజానికి బీజేపీలో కూడా అంతర్గత ఐక్యత పెద్దగా లేదు. తమ పార్టీ వారు కొందరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చేతులు కలిపారని గతంలో ఆరోపించిన వివాదాస్పద ఎమ్మెల్యే రాజాసింగ్ విలీనం ప్రయత్నాలు కూడా తోసిపుచ్చలేనని సందేహం ప్రకటించారు. గతంలో కాంగ్రెస్‌తో విలీనం అవుతామని ఆశపెట్టి ఆఖరిలో అడ్డం తిరిగిన కేసీఆర్‌ను నమ్మవద్దని అటు బీజేపీ నాయకులు చెప్తుంటే.. ఆ పార్టీతో కలిసిన వారెవరు బాగుపడలేదని కవిత తన తండ్రిని హెచ్చరిస్తున్నారు. వేరే పార్టీ యోచన లేదని కవిత పదేపదే చెప్పడం కూడా దీన్నే బలపరుస్తున్నది. అసలు ఇదంతా టీ కప్పులో తుపాను వంటిదేనని తమ వైఫల్యాలు నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి అంతర్గత విభేదాలను అతిగా ముందుకు తేవడం కేసీఆర్‌కు అలవాటైన ఎత్తుగడ అని కొందరు విమర్శకులు మాట. కానీ ఈ కథ ఇంత దూరం రావడం వెనక బీజేపీ అదృశ్యహస్తం ఏ మేరకు పనిచేస్తున్నది?

### కడప కథా అదేనా?

ఇదే ఏపీలో మరో రూపంలో కనిపిస్తున్నది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక జరిగిన తొలి మహానాడు కడపలో ముగిసింది. 43 ఏండ్ల తెలుగుదేశం, నాలుగో దఫా పాలన తొలి ఏడాది పూర్తి చేసుకుంటున్న చంద్రబాబు భవిష్యత్ రాజ కీయ గమనం ఎలా ఉంటుందనేది అందరి దష్టిలో కీలకంగా ఉంది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభు త్వంలో భాగస్వామిగా ఉంటూ రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ జనసేన, బీజేపీలతో కలిసి అధికారం పంచుకుంటున్నందున రాజకీయ పొందికల గురించి ఏం చెప్తారు అన్నది కూడా ఆసక్తికరంగా ఉంది. అట్టహాసాలు, ఆర్భాటాలుచాలా ఉన్నా ఈ అన్ని విషయాల్లోనూ అస్పష్టతనే మిగిలిస్తూ మహానాడు ముగిసింది. రాష్ట్రానికి సంబంధించి గాని. తెలుగు దేశం అంతర్గత వ్యవహారాలకు సంబంధించి గాని నిర్మాణాత్మకంగా నిర్దిష్టంగా చెప్పింది దాదాపు లేదు.చంద్రబాబు నాయుడును జగన్ ప్రభుత్వం అరెస్టు చేసి రాజమండ్రి జైల్లో నిర్బంధించినప్పుడు పెద్దమ్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మధ్యవర్తిత్వంతో లోకేష్ నేరుగా హోం మంత్రి అమిత్‌షా తో మంతనాలు జరిపారు. అప్పుడే టీడీపీ పూర్తిగా బీజేపీతో లంకె వేసుకుంది. మహానాడుకు ముందు , సకుటుంబం లోకేష్ మోడీని కలుసుకొని రావటం, తర్వాత చంద్రబాబు భేటీ ఇందులో భాగమే. టీడీపీలో సూపర్ సీనియర్లను నమస్కార బాణం వేసి మొత్తం సారథ్యం అంటే లోకేష్ బందానికి అప్పగించటం వెనుక నేపథ్యం ఇది. బీజేపీ రాజకీయ వ్యూహాలకు అనుగుణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన జపం చేస్తుంటే లోకేష్ కూడా టీడీపీని అదే బాటలో వేగంగా నడిపించడం కొత్త పరిణామం. అందుకే మొత్తం మహానాడులో ఎక్కడ లౌకికతత్వం, మతసామరస్యాన్ని కాపాడుకోవడం వంటి మాటలే వినిపించలేదు. ఆ పార్టీ రాజకీయ తీర్మానంలో కూడా ఆ పదాలు లేవు. అమరావతికి కేంద్రం సహకరించాలని విభజన చట్టంలో ఉన్నది. కానీ మోడీ సర్కారు ప్రపంచ బ్యాంకు అప్పు ఇప్పించటమే ఘనతగా చెప్పడం తప్ప ఆ హామీ అమలు చేయమని అడిగే ఆలోచన కూడా లేకపోయింది.. ఏపీలో వైసీపీ టీడీపీ, జనసేన, తెలంగాణలో బీఆర్ఎస్ నాలుగు ప్రాంతీయ పార్టీలు బీజేపీ ముందు గప్ చిప్ కావడమే ఇక్కడ ఉమ్మడి అంశం. కడపలో విన్యాసాలు, కవిత లేఖ లీక్‌లూ షాక్‌లూ ఈ మొత్తం వ్యవహారంలో తాజా ట్విస్ట్ మాత్రమే.

# యోగా మన ఘన వారసత్వ సంపద

విజయవాడ, యోగా మన ఘన వారసత్వ సంపద అని.. శారీరక ఆరోగ్యంతో పాటు- మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే యోగాను ప్రతిఒక్కరూ తమ రోజువారీ టైమ్‌టేబుల్‌లో మొదటి అంశంగా చేసుకోవాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా రోజూ ప్రత్యేక యోగాభ్యసన కార్యక్రమం చేపట్టి చైతన్యం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు, యోగా ఔత్సాహికులతో కలిసి యోగాసనాలను అభ్యసిస్తున్నారని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఏటా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నామని, ఇది దేశానికే గర్వకారణమన్నారు. రాష్ట్రం నలుమూలల కూ యోగా విశిష్టతను చేరువచేసేందుకు ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంతమంచి కార్యక్రమంలో రోజూభాగస్వామ్యం కావడం ఆనందం కలిగిస్తోందన్నారు. మన ఆరోగ్య సంరక్షణకు రోజూ ఉదయం సూర్య నమస్కారాలు ఎలాగైతే చేస్తామో యోగాలో అది ఒక భాగమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో ప్రతి గ్రామం, ప్రతి వార్డులోనూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇదే విధంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మొదటిగా గాంధీ హిల్‌పై నిర్వహించామని, ఇదేవిధంగా ఆదివారం పవిత్ర సంగమం వద్ద నిర్వహించిన కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. మనం చేసే ప్రతి పనిద్వారా మంచి ఫలితాలు రావడానికి, ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకునేందుకు యోగా ఉపయోగపడుతుందని అన్నారు. జూన్ 21 నాటికి మన జిల్లాలో కొత్తగా పది లక్షల మందికి యోగాను నేర్పించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయుష్ డిపార్టుమెంట్ 45 నిమిషాల కామన్‌యోగా ప్రోటోకాల్ ఆధారంగా యోగాను ప్రతి వర్గానికీ చేరువచేసేందుకు కృషిచేస్తున్నామని.. ఇందుకు ప్రతిరోజు ఒక థీమ్ పెట్టుకొని యోగా అవగాహన, అభ్యసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు-తెలిపారు. ప్రతిఒక్కరూ యోగాను ప్రాక్టీస్ చేసి, మరో పదిమందితో ప్రాక్టీస్ చేయించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

## విద్యారంగ బడ్జెట్ పెరగాలి

న్యూఢిల్లీ, కేజ్రీవాల్ సిఎంగా ఉన్న సమయంలో ఢిల్లీ రాష్ట్రం విద్యారంగానికి తన బడ్జెట్‌లో అత్యధికంగా 25శాతం నిధులను కేటాయించగా వెనుకబడిన రాష్ట్రంగా చెప్పుకొనే బీహార్ తన బడ్జెట్‌లో విద్యకు 19శాతం నిధుల్ని కేటాయించింది. చివరకు జార్ఖండ్ కూడా తన బడ్జెట్‌లో 16శాతం నిధుల్ని కేటాయించింది. ఒక్క తెలంగాణ మినహా దాదాపుగా అన్ని రాష్ట్రాలు విద్యారంగానికి తమ బడ్జెట్‌లలో 10శాతం నుంచి 16శాతం నిధులు కేటాయించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పీఆర్ఎస్ ఇండియా అనే సంస్థ రూపొందించిన 'స్టేట్ ఆఫ్ స్టేట్ ఫైనాన్సెస్' రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులు అనే నివేదికలో ఈ వాస్తవాలు వెల్లడి అయ్యాయి. 2014-15 బ్జడెట్‌లో 10.89శాతం నిధులను కేటాయించిన 2021-22లో రాష్ట్ర బ్జడెట్ పరిమాణం రూ.2 లక్షల 30 వేల కోట్లు. ఇందులో విద్యారంగానికి కేటాయించినది రూ.15,608 కోట్లు (6.78శాతం). తెలంగాణలో అక్షరాస్యత రేటు 71.08 శాతం. దేశంలో అక్షరాస్యత సగటు రేటు 77.7శాతం. అక్షరాస్యతలో దేశంలో తెలంగాణది 24వ స్థానం. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 281 బీసీ గురుకులాలు; 192 మైనార్టీ గురుకులాలు ఉండగా వీటిల్లో ఒక్కదానికి కూడా సొంత బిల్డింగ్ లేదు. 268 ఎస్సీ గురుకులాలు ఉండగా అందులో 150 ఇప్పటికీ కిరాయి భవనాల్లో ఉన్నాయి. 180 ఎస్టీ గురుకులాలు ఉండగా అందులో 30 ఇంకా అద్దె భవనాల్లో ఉన్నాయి. ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టళ్లు 1700కు పైగా ఉండగా అందులో 4 లక్షల మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ఈ భవనాల్లో అత్యధికం శిథిలావస్థకు చేరాయి. స్టూడెంట్ల సంఖ్యకు సరిపడా డార్మెటరీలు, డైనింగ్ హాల్స్, వాష్‌రూములు లేవు. బాత్‌రూములకు రోజూ నీరు రాదు. దాంతో 3, 4 రోజులకొకసారి మాత్రమే స్టూడెంట్లు స్నానం చేయగలుగుతున్నారు.తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు అని ప్రకటించిన సిఎం రేవంత్ ముందుగా ఉన్న సంక్షేమ స్కూళ్లను పటిష్టం చేయాల్సి ఉంది.

# జగన్ కి ఎన్ని మార్కులు ?

అమరావతి,ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం మరి కొద్ది రోజులలో ఏడాది పాలన పూర్తి చేసుకోబోతోంది. 2024 జూన్ 12న కూటమి ప్రభుత్వం ప్రమాణం చేసింది. దాంతో అయిదేళ్ల ప్రజల తీర్పులో ఒక ఏడాది గడచింది. ఈ ఏడాదిలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏమీ చేయలేదని ఆరోపిస్తూ వైసీపీ ఎన్నికల ఫలితాలు వచ్చిన జూన్ 4న తేదీన వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తోంది.అంటే ఏడాది కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ ఈ నిరసనలు అన్న మాట. విపక్ష పార్టీగా వైసీపీకి ఆ హక్కు ఉంది. అదే సమయంలో ఏ ప్రభుత్వంలో అయినా లోపాలు ఉంటాయి. అలాగే కొన్ని చేయగలరు, కొన్ని చేయలేకపోతారు. దాంతో విపక్షం మాత్రం విమర్శలకు ఎదురుచూస్తుంటుంది కాబట్టి కచ్చితంగా దానిని వాడుకుంటుంది.మరి విపక్ష నేతగా జగన్ కి కూడా తొలి ఏడాది ఎలా గడచింది. ఆయన పెర్ఫార్మెన్స్ ఎలా ఉంది. ఆయన ఈ ఏడాదితో ప్రజల పక్షాన నిలబడి చేసిన పోరాటాలు ఎన్ని ఉన్నాయన్నది కూడా చర్చకు వస్తోంది. ఏపీ ప్రజలు 2024 ఎన్నికల్లో విభిన్నమైన తీర్పు ఇచ్చారు. 164 సీట్లు కూటమికి ఇచ్చిన వారు కేవలం 11 సీట్లు మాత్రమే వైసీపీకి ఇచ్చారు. అలా విపక్ష హోదా లేని నేతగా జగన్ ని ఉంచారు. ఇది జగన్ మొత్తం పొలిటికల్ కెరీర్ లో వింత అనుభవం. ఆయనకు విపక్ష పాత్ర కొత్త కాదు కానీ హోదా లేని పాత్ర మాత్రం ఇదే కావడంతో ఆయన చాలా కొత్తగానే ఫీల్ అవుతూ వచ్చారు.ఆయన వెనక పది మంది మాత్రమే ఎమ్మెల్యేల బలాన్ని ఇచ్చి బలమైన కూటమి ప్రభుత్వం మీద పోరాడమని జనాలు ఒక సందేశం ఇచ్చారు. అయితే జగన్ మాత్రం ఈ ఏడాదిలో అసెంబ్లీకి పోలేదు, తనకు విపక్ష హోదా కావాలని ఆయన కోరుతూ వచ్చారు. దాని మీద కోర్టుకు వెళ్ళారు.ఇక ఈ ఏడాదితో తన పార్టీ వారి చేత కొన్ని నిరసన కార్యక్రమాలు చేయించారు. తాను మాత్రం ఎక్కడా పాల్గొనలేదు. అతి తక్కువ సందర్భాలలో మాత్రమే ఆయన జనంలోకి వచ్చారు. అది కూడా పరామర్శలకే పరిమితం అయ్యారు.కూటమి ప్రభుత్వానికి జగన్ ఏకంగా ఏడాది పాటు హనీమూన్ పీరియడ్ గా ఇచ్చేశారు. అలా విపక్ష నేతగా జగన్ అనుకున్న స్థాయిలో పనిచేయలేదా అన్న చర్చ అయితే ఉంది. ఆయన జనంలోకి రాకుండా ఉండడమే కాదు బెంగళూరు టూ తాడేపల్లి షటిల్ సర్వీస్ చేస్తూ గడిపారు.ఈ లెక్క తీసుకుంటే కనుక ఆయన ఏడాదిలో దాదాపుగా సగం రోజుల పాటు బెంగళూరులోనే ఉన్నారని భావించాలని అంటున్నారు. మరో వైపు చూస్తే జగన్ మీడియా సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అవి కూడా ఎక్కువగా అయితే లేవు. తనకు నచ్చినపుడు మాత్రమే మీడియాను పిలిచి ప్రభుత్వం మీద కామెంట్స్ చేస్తూ వచ్చారు.ఆ విధంగా జగన్ మీడియా ముఖంగానే విపక్ష పాత్ర పోషించారు. తొలి ఏడాది సూపర్ సిక్స్ హామీలు అమలు కాలేదని వైసీపీ ఆరోపిస్తోంది. అందుకే వెన్నుపోటు దినం అని చెబుతోంది. కానీ ప్రభుత్వం మీద పెట్టాల్సిన ఒత్తిడి ఒక విపక్ష పార్టీగా వైసీపీ ఎంతవరకూ పెట్టింది అన్నది కూడా చర్చకు వస్తోంది.

# గ్రంథాలయాల ఆవశ్యకతను గుర్తించాలి

నిజామాబాద్, సెల్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాక రానురాను గ్రంథాలయాల ప్రాధాన్యం తగ్గుతోంది. పిల్లల్లో సృజనాత్మకతను పెంచాల్సిన అవసరం ఉంది. అందుకు పుస్తక పఠనం అవసరం. ఇది గ్రంథాలయాలతోనే సాధ్యం. అయితే ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చాక గ్రామాల్లో వీటిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయితే గ్రంథాలయాలను పటిష్టం చేసుకుంటూ, ఇంటర్‌నెట్‌ను కూడా అందుబాటులోకి చేసుకునే విధంగా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలకు కనీసం చదవడం, రాయడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటువంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూడా చిన్న, చిన్న పుస్తక మహోత్సవాలను నిర్వహించి స్థానిక రచయితలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సాహిత్యాన్ని పరిపుష్టం చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో కూడా గ్రంథాలయాలను ఆధునీకరించాలి. పుస్తకాల పఠనంపై ఆసక్తి తగ్గడంతో ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. అంతెందుకు స్కూళ్లలో కూడా గ్రంథాలయాలు అంతంతగానే ఉంటున్నాయి. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర గ్రంథాలు అందుబాటులో ఉండడం లేదు. రెఫరెన్స్ పుస్తకాలు కూడా దొరకడం లేదు. డబ్బుండి కొనుక్కునే వారికి తప్ప పుస్తకాలు లేక లైబ్రరీలు నిరుపయోగం అవుతున్నాయి. అంతకుమించి నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతోంది. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు తగ్గడం, సామాజిక శాస్త్రాలు చదివిన వారికి తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఆ శాస్త్రాలపై నేటి యువత మొగ్గుచూపడం లేదు. తద్వారా సమాజంతో బంధానికి దూరమౌతున్నారు. పాఠశాలల్లో ఒకప్పుడు లైబ్రేరియన్ పోస్టులు వుండేవి. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా విద్యాలయాల్లో విద్యార్థులకు పాఠశాలల్లో లభిస్తున్న పుస్తకాలపై అవగాహన కలగడం లేదు. ఇటువంటి పరిస్థితులలో సాహితీవేత్తలు, భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు గ్రంథాలయ ఉద్యమాలు వంటివి మరోసారి ప్రారంభించాల్సిన అవసరం వుంది. ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా మారింది. పాలకుల నుండి కూడా పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. కేవలం పోటీ పరీక్షల కోసం ముద్రించే పుస్తకాలకు మాత్రమే డిమాండ్ ఉంటోంది. యువతలో ఎక్కువ మంది సినీ సాహిత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 'యునెస్కో' అంచనా ప్రకారం ప్రతి ఐదువేల మందికి ఒక గ్రంథాలయం ఉండాలి. మన దేశంలో కేవలం 75 వేల గ్రంథాలయాలు ఉన్నాయనేది ఒక అనధికార అంచనా. గ్రంథాలయాల్లో పోస్టుల భర్తీ కూడా సక్రమంగా జరగడం లేదు. చాలా గ్రంథాలయాలను ఆధునీకరించడం లేదు. లైబ్రరీలలో పాత పుస్తకాలే దర్శనమిస్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాలని కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. ఆ రోజుల్లోనే అయ్యంకి రమణయ్య గ్రంథాలయాల అభివృద్ధికి పది ఎకరాల స్థలాన్ని దానం చేసి 'గ్రంథాలయ ఉద్యమ పిత' గా పేరు పొందారు. ఇప్పుడు గ్రంథాలయ ఉద్యమం మరోమారు చేయాల్సి ఉంది. ప్రతి పాఠశాలలో గ్రంథాలయాలను అభివృద్ధి చేయాల్సి ఉంది.

# ఒకటే ముచ్చట...

హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత కుటుంబ కలహాలు బజారు పడ్డాయి. పతాక స్థాయికి చేరాయి. మాటలు లేవు మాట్లాడుకోవడాలు లేవు అన్నట్లు, పార్టీ, కుటుంబ రాజకీయాలనే కాదు, రాష్ట్ర రాజకీయాలలోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రోజు రోజుకు మరింతగా ముదిరి పాకాన పడుతున్నాయి. రాజకీయాలను రక్తి కట్టిస్తున్నాయి. అయితే, అంతర్గత కుమ్ములాటలు ఒక్క బీఆర్ఎస్ కు మాత్రమే పరిమితమా అంటే కాదు.. అన్ని పార్టీలలో ఉన్నదే.. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీలలోనూ అదే పరిస్థితి వుంది. మూడు పార్టీలలో ఒకటే ముచ్చట నడుస్తోంది. చిన్న గీత పెద్ద గీత అంతే, అదొక్కటే తేడా, మిగిలినదంతా సేమ్ టూ సేమ్. అవును.. అన్ని పార్టీలలో, ప్రధానంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో, కేంద్రంలో అధికారంలోఉన్న బీజేపీలోనూ ధిక్కార స్వరాలు గట్టిగానే వినిపిస్తున్నాయి. పార్టీ విధానాలను చిన్నా పెద్ద నాయకులు ప్రశ్నిస్తున్నారు. గీత దాటుతున్నారు. నేతలను నిలదీస్తునారు. అంతే కాదు.. ఇదొక అంటూ వ్యాధిలా ఒక పార్టీ నుంచి మరో పార్టీకి, ఒక నాయకుడి నుంచి మరో నాయకుడికి పాకుతోందని, రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.రాజకీయ పార్టీలలో అంతర్గత కుమ్ములాటలకు పదవీ కాంక్ష ఒక ప్రధాన కారణం అయితే.. రాజకీయ పార్టీలలో ప్రజాస్వామ్య పరిధి, పరిమితి రోజురోజుకు కుచించుకు పోవడం మరో ప్రధాన కారణంగా రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పదవీ కాంక్ష పై కొచ్చినప్పుడు బంధాలు, బాంధవ్యాలు కూడా కొట్టుకు పోతున్నాయని అంటున్నారు. నిజానికి, ఈ రోజు బీఆర్ఎస్ లో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే, ఇది ఫక్తు పదహారణాల కుటుంబ కలహాల చిత్రం లా సాగుతోందని అంటున్నారు. అన్నా, చెల్లి మధ్య కుర్చీలాటగా మొదలైన వివాదం మెల్లమెల్లగా కుటుంబ పరిధిని, పార్టీ పరిధిని దాటి ఇప్పుడు రాష్ట్ర సమస్యగా మారింది. ఒక చోటి నుంచి ఒక చోటికి పాకుతూ.. పక్క దారులు పట్టి పోతోంది. రాష్ట్ర హద్దులు దాటి జాతీయ మీడియాలోనూ చర్చకు వస్తున్నా పెద్దాయన కేసీఆర్ పెదవి విప్పక పోవడం చిత్రంగా ఉందని అంటున్నారు. నిజానికి.. ఆయన తలచుకుంటే, సమస్య ఇంత వరకు వచ్చేది కాదని, అయినా ఆయన మౌనంగా ఉండడమే కాకుండా, మధ్య వర్తిత్వం జరిపేందుకు ముందుకు వచ్చిన కుటుంబ, పార్టీ పెద్దలకు కూడా పర్మిషన్ ఇవ్వ లేదని అంటున్నారు. మరోవంక కవిత, కేసీఆర్ ను కలిసే అవకాశం వచ్చినా కలవలేక పోయానని,అంటున్నారు. మరోవంక బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని కవిత చేసిన కామెంట్ బీజేపీలో చిచ్చు పెట్టింది. అంతో ఇంతో ఇంకా క్రమశిక్షణ బతికున్న పార్టీగా భావించే బీజేపీలోనూ కవిత కామెంట్ నిప్పు పెట్టింది. ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్యేగా ముద్ర వేసుకున్న గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ కవిత కామెంట్ ను ఎండార్స్ చేశారు. ఆమె చెప్పింది సత్యమని సర్టిఫికేట్ ఇచ్చారు. అంతే కాదు.. రాష్ట్ర అపార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని బహిరంగంగా విమర్శించారు. సరైన రేటు ఇస్తే, ప్లేటు మార్చేందుకు తమ పార్టీ నాయకులు ఎప్పుడూ సిద్దంగా ఉంటారని అన్నారు. ఆయన ఒకరనే కాదు.. కవిత ఇష్యూలో వేలు పెట్టవద్దని అధిష్టానం ఆదేశించినా.. బీజేపీ నాయకులు ఎవరికి వారుగానే సొంత అభిప్రాయాలు, విశ్లేషణలు వినిపిస్తున్నారు. కవిత విషయంలోనే కాదు.. అంతర్గత కుమ్ములాటల కారణంగానే పార్టీ అధ్యక్ష ఎన్నిక ఒక అంతులేని కథల సాగుతోంది. ఇక కాంగ్రెస్ విషయం అయితే చెప్పనే అక్కర లేదు. ముందు అసమ్మతి పుట్టి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ పుట్టింది అంటే అందులో తప్పులేదు. అదేమంటే, మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువ అంటారు. అందుకే.. పార్టీ ఎమ్మెల్సీ సభలోనే ప్రభుత్వ విధానాలను విమర్శిస్తారు. ఎమ్మెల్యేలు, నాయకులు పదవుల కోసం గాంధీ భవన్ మెట్ల మీదనే ధర్నా చేస్తారు. అంతవరకు ఎందుకు.. అంతర్గత కుమ్ములాటల కారణం గానే ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అయినా ఇంతవరకు పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పడ లేదు. కనీసం పీసీసీ ఏర్పాటుకు కూడా మీన మేషాలు లెక్క పెట్టవలసి వస్తోంది. సో. అంతర్గత కుమ్ములాటల విషయంలో అన్ని పార్టీలది ఒకటే మాట ..అంతర్గత ప్రజాస్వామ్యం లేక పోవడమే ఈ పరిస్థితికి కారణమని పరిశీలకులు అంటున్నారు.

# ఆత్మ స్తుతి,మోడీ స్తుతి కోసమేనా మహానాడు?



అమరావతి,ఆంధ్రప్రదేలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక జరిగిన తొలి మహానాడు సభ ముగిసింది. తిరుపతి మినహా గతంలో రాయలసీమలో మహానాడు జరగలేదు. కడప జిల్లాలో అంటే వై.యస్.రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి అధికార పీఠంగా పరిగణించబడుతుంది కనుక అక్కడ మహానాడు నిర్వహించడమే ఒక రాజకీయ సంకేతం లాంటిది. అంగరంగ వైభవంగా భారీ ప్రచారంతో సాగిన ఈ మహానాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు, మంత్రి లోకేష్ లకు అమితమైన సంతోషాన్ని ఇవ్వడంలో ఆశ్చర్యమేమీ లేదు. సభలు మొదలు కాకముందు నుంచే లోకేష్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తారనే ప్రచారం మార్మోగింది. ఐదేళ్ల విరామంతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకోవస్తున్నది. కనుక 43 ఏళ్ల తెలుగుదేశం, నాలుగో దఫా పాలన తొలి ఏడాది పూర్తి చేసుకుంటున్న చంద్రబాబు భవిష్యత్ రాజకీయ గమనం ఎలా ఉంటుందనేది అందరి దృష్టిలో కీలకంగా ఉండింది. ఒకవైపు వైసిపి, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అనుచరులపై వరుస కేసులు, అరెస్టులు సాగుతుండగా మరోవైపు కూటమిలో సర్దుబాట్లు, కేంద్రం సహాయం తీరుతెన్నులు, తెలుగుదేశంలో సీనియర్ జూనియర్ల మధ్య గడబిడలూ, ఆశావహుల అసంతృప్తులు ఇవన్నీ రంగం మీదకు వచ్చాయి. జగన్ ప్రభుత్వ తప్పిదాలపై తీవ్ర అసంతృప్తితో తమను గెలిపించిన ప్రజలకు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాల అమలుపై మహానాడులో ఏం చెప్తారోనని సామాన్య జనం కూడా ఎదురుచూశారు.


### అతిశయాలతో ఆత్మ స్తుతి

అట్టహాసాలు, ఆర్భాటాలు చాలా ఉన్నా ఈ అన్ని విషయాల్లోనూ అస్పష్టతనే మిగిలిస్తూ మహానాడు ముగిసింది. రాష్ట్రానికి సంబంధించి గాని, తెలుగుదేశం అంతర్గత వ్యవహారాలకు సంబంధించి గాని నిర్మాణాత్మకంగా నిర్దిష్టంగా చెప్పింది దాదాపు లేదు. పైగా ఇది వ్యూహాత్మకంగా జరిగిందే తప్ప యాదృచ్ఛికం కాదు. అయినా మహానాడు మరునాడే చంద్రబాబు నాయుడు జాతీయ మీడియాలోనూ, సిఐఐ వంటి వేదికలపైనా చేసిన ప్రసంగాలలో ఏపీ బ్రాండ్ ఏదో మారిపోయి పెట్టుబడుల వరద ప్రవహిస్తున్నట్టు తాను అద్భుతమైన పథకాలను రూపకల్పన చేసినట్టు మాట్లాడటం దీనికి కొసమెరుపు. ఎందుకంటే ఆయన చెబుతున్న వాటి నికర ఫలితాలు ఏవీ వచ్చింది లేదు. అసలు ఆ విధానాల పూర్తి స్వరూపం, కాల వ్యవధి నిర్దిష్ట రూపంలో అందుబాటులో లేవు. లోకేష్‌కు ప్రమోషన్ ఎప్పుడు ఎలా ఇస్తారన్నది పూర్తిగా తెలుగుదేశం పార్టీ అంతర్గత విషయమే. కావలసినంత ఎలివేషన్ అయిపోయిందని, డిక్లరేషన్ మాత్రమే మిగిలిందని టిడిపి ముఖ్యులే అంటున్నారు. చంద్రబాబు నాయుడుని మరోసారి రెండేళ్ల కాలానికి అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో ఒక ఘట్టం పూర్తయింది. మిగిలిన నియామకాలకు ఆయనే ముహూర్తం నిర్ణయించుకుంటారు. పదవులకు సంబంధించిన అంశాలు అలా ఉంచితే తెలుగుదేశం పార్టీ రాజకీయ విధానాలు, కూటమి ప్రభుత్వ పాలన విధానాలు మాత్రం ప్రజలందరికీ సంబంధించినవి. దేశాన్ని పాలించే ఎన్డీఏ కూటమికి ప్రధాన మద్దతుదారుగా ఉన్నందువల్ల జాతీయ రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాల మీద కూడా ఒక వైఖరి ప్రకటించాల్సిన బాధ్యత మహానాడుపై ఉండింది. కానీ ఆత్మ స్తుతి, మోడీ స్తుతి, ఆర్భాటపు ప్రకటనలు మినహాయిస్తే ఆ విధమైన రాజకీయ, పరిపాలనా నిర్దేశం ఏదీ కనిపించకపోవడం అతి పెద్ద లోపం. ఆర్థికంగా తీవ్ర లోటులో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన భారీ హామీలు అమలు చేయగలిగిన స్థితిలో లేదు. అందుకోసం టిడిపి మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం అటు నుంచి కనీసం గట్టిగా అడిగే పరిస్థితిలో కూడా లేదు. ఇప్పటికే ఏడాదిలో లక్ష కోట్ల పైన అప్పులు చేశారన్న విమర్శలు మోగుతున్నాయి. తొలి ఏడాదిపై కాగ్ ఇచ్చిన నివేదిక చూస్తే 95 వేల కోట్లు ప్రభుత్వ వ్యయం లోటు కనిపిస్తుంది. వీటికి తోడు ఇంటి పన్ను, కరెంటు చార్జీలు మోత మోగిపోతున్నాయి. ఏపీ అంటే అమరావతి–పోలవరం అనే చంద్రబాబు ఇచ్చిన నిర్వచనంతో తేడాలు చాలా ఉన్నాయి కానీ వాటికి కూడా నిధుల కేటాయింపులు, పునరావాస ప్రణాళికలు ఏమాత్రం జరిగింది లేదు. పోలవరం 2027కు పూర్తి చేస్తామని మహానాడులో చంద్రబాబు హామీ ఇస్తున్నప్పుడు ఈ ప్రశ్నలు రాకుండా ఉండవు. అమరావతికి కేంద్రం సహకరించాలని విభజన చట్టంలో ఉన్నది. కానీ మోడీ సర్కారు ప్రపంచ బ్యాంకు అప్పు ఇప్పించటమే ఘనతగా చెప్పడం తప్ప ఆ హామీ అమలు చేయమని అడిగే ఆలోచన కూడా లేకపోయింది. కేంద్రం బాధ్యతగా ఉన్న రెండు కీలక అంశాల్లోనే ఇంత తడబాటు ఉంటే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఏదో సాధించి పెట్టడం ఊహకందని విషయం. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం పేర మరో 45 వేల ఎకరాలు కావాలని ప్రకటించడం, అసలు రాజధానికే మరో పది వేల ఎకరాలు అవసరమవుతాయని చెప్పడం చూసి జనం నిర్ఘాంతపోతున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు కూడా మరింత భూమిని కేటాయించారు. ఉర్సా భూముల వ్యవహారాన్ని సమర్థించుకున్నారు.

### కేంద్రాన్ని అడగరా?

గత ఐదేళ్లు పాలించిన వైసిపి ఈ విషయంలో చూపిన నిర్లక్ష్యం అస్తవ్యస్త నిర్ణయాలు ఎంతైనా ఖండించవచ్చు. కానీ ఆ పేరుతో ప్రస్తుత కర్తవ్యాలను దాటవేయడం, కేంద్రం సహాయంపై ఒత్తిడి పెట్టకపోవడం ఎలా సమర్థనీయం? తమ సొంత కారణాల వల్ల మోడీతో తెలుగుదేశం పోట్లాడటం కష్టం అనుకుంటే అప్పుడు అఖిలపక్ష వేదికల నుంచి రాష్ట్రం తరపున ఒత్తిడి తేవడం సరైన మార్గం. అది విభజిత రాష్ట్రం హక్కు కూడా. కానీ మూడు రోజుల మహానాడులో అంతా మేము చూసుకుంటామనే ఊకదంపుడుతోనే సరిపోయింది. తమను తాము పొగుడుకున్నది చాలక ఎన్టీఆర్ ఏఐ ఇమేజ్ తోనూ పొగిడించుకున్నారు. ఆయన వారసత్వం చూస్తే అయోధ్యకు అద్వానీ రథయాత్ర, బాబ్రీ మసీదు విధ్వంసం అనంతరం ఎన్టీఆర్ బిజెపిని పూర్తిగా దూరంపెట్టారు. కింగ్ మేకర్‌గా అభివర్ణించబడే చంద్రబాబు నాయుడు నిజానికి కింగ్‌బ్యాకర్‌గా మారి అప్పుడు వాజ్‌పేయిని, ఇప్పుడు మోడీని దేశం నెత్తిన రుద్దడానికి ప్రధాన కారకులయ్యారు. హరికిషన్ సింగ్ సూర్జిత్, జ్యోతి బసు, వి.పి సింగ్ వంటి ఉద్దండుల అండదండతో యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ గా ఉన్నప్పుడు మాత్రమే ఆయన నిజమైన అర్థంలో కేంద్ర రాజకీయాలలో గౌరవప్రదమైన పాత్ర పోషించ గలిగారు. బిజెపి–ఎన్‌డిఎల దగ్గర ఆయనది వత్తాసు పలికే పాత్ర మాత్రమే. ఆయన మూడుసార్లు విజయం

# ఉద్యమకారులకేదీ ఊరట?



హైదరాబాద్,రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా తలపెట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిమగ్నమైంది. అవతరణ దినం జూన్ 2న వితరణ, ఆదరణల జాబితా రెడీ చేస్తోంది. రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలు వగైరా పంపిణీ చేయనుంది. తెలంగాణ ఉద్యమంలో ముఖ్యభూమిక పోషించిన కవులు, కళాకారులు, ప్రముఖులను గౌరవించుకోనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వారికి రూ. ఒక కోటి చొప్పున చెక్కులు, ఫ్యూచర్ సిటీలో 300 గజాల వంతున ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ సికిందరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అందజేస్తారు. స్వరాష్ట్ర సాధన పోరాటాల్లో కేసులు, జైలు పాలైన తెలంగాణ ఉద్యమకారులకు అదే 'చెయ్యి' తో నివేశనా స్థలాల పంపిణీ ప్రారంభించి అవతరణ దినోత్సవాన్ని సార్థకం చేయాలి రేవంతన్నా. డజను వందల మంది ప్రాణత్యాగం.. వేలాది మంది జైలు జీవితం.. వర్ణనకు అందని వెతల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జూన్ 2. ఆ రోజటి వితరణ, ఆదరణ జాబితాలో స్వరాష్ట్ర ఉద్యమకారులకు ప్రోత్సాహకాల అంశం జాడ ఉండాలి.వారికి ఊరట, ఉపశమనం, గౌరవం, గుర్తింపు దక్కాలి. కెసిఆర్ చేయలేనివి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సర్కారు చేయాలి. ఎలాగూ డబ్బులతో ముడిపడినవి అంటేనే విసుక్కుంటున్న ప్రజాప్రభుత్వం కనీసం ఆర్థికేతర ప్రయోజనాలైనా తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులకు, ఉద్యమ కాలం ఆసాంతం అలుపెరుగని రిపోర్టింగ్ చేసిన తెలంగాణ పాత్రికేయులు అందరికీ బేషరతుగా ఒనగూర్చాలి. మచ్చుకు సిహెచ్ వెంకట నర్సింగారావు, గాడిచెర్ల దేవయ్య ముదిరాజ్, ఉల్లి యాది మల్లేశ్ యాదవ్%ొ% నాటి ఉమ్మడి కరీంనగర్, నేటి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన టి(బి)ఆర్ఎస్ సీనియర్ కార్యకర్తలు. తెలంగాణ సాధన సమరాంగణాన 2009లో ఉద్యమ కేసులతో వాళ్ళు జైలు జీవితం గడిపారు. వారిలాగే రాష్ట్రం నలుమూలలా వేలాది మంది తమ వ్యక్తిగత జీవితాల్లోని ప్రైమ్‌టైమ్‌ను తెలంగాణ కోసం పణంగా పెట్టారు. బిఆర్ఎస్ అనే కాదు కాంగ్రెస్, బిజెపి సహా అన్ని రాజకీయ పక్షాలు, సంస్థల వారూ తెలంగాణ స్వాతంత్ర్యం కోసం ఫీల్డులో పోరాడారు.తన పార్టీ వారికీ మేలు జరిగేలా, తన పర భేదం లేకుండా మొత్తంగా తెలంగాణ ఉద్యమకారులు అందరినీ అధికారికంగా గుర్తించి ఆదరించడానికి సరాసరి రెండు పర్యాయాల పాలనా కాలం కెసిఆర్ ప్రభుత్వానికి సరిపోలేదు. మరుగున పడిన తెలంగాణ ఉద్యమకారుల నివేశనా స్థలాల ఫైలునూ వెంటనే ముందర వేసుకోవాలి. కేసులై జైలు కెళ్ళిన తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులకు ఒకే చోట ఫోర్త్ సిటీలో ప్లాట్లు ఇవ్వాలి. ఉద్యమ సారథిగా తెలంగాణ తొలి సిఎం కెసిఆర్ చేయలేకపోయిన మేలు చేసి చూపించాలి. జూన్ 2 జాబితాలో ఈ అంశాన్ని సత్వరం చేర్చాలి. ఆ రోజు నిర్దిష్ట కాలావధితో ఓ విధాన ప్రకటన చేసి, అవతరణ వేడుకలను సుసంపన్నం చేయాలి. ఎన్నెన్నో ఉద్వేగాల జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవం.తెలంగాణ రాష్ట్రం అయ్యాక మొదటిసారి ఏలుబడిలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇది రెండో అవతరణ దినం. ఫస్ట్ టైం అధికారంలోకి వచ్చాక జూన్ 2 కేవలం ఆరు నెలల్లో తలుపు తట్టింది. అప్పటికి సెట్ రైట్ అవ్వాల్సినవి ఉండేవి. అందువల్ల ఆయా వర్గాలవారు అర్థం చేసుకున్నారు. అలాంటి వాళ్ళలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ఉన్నారు. సమైక్య పాలనలో ఎందరో ఒకటికిమించి అనేక కేసుల్లో నిందితులుగా పోలీసు రికార్డుల్లోకి ఎక్కారు. అరెస్టు, జైలూ తప్పని తెలంగాణ వాదులు చాలా మందే. ఒక లెక్క ప్రకారం చూస్తే 2009 డిసెంబర్ 9 నుంచి 2014 జూన్ 2 వరకు (రాష్ట్రం ఏర్పడే వరకు) 2254 కేసులు రిజిస్టర్ అయినట్టు అంచనా. ఆ కేసుల్లో ఉన్న వాళ్ళలో ప్రొఫెషనల్స్‌గా పొలిటీషియన్లతో పాటు, విద్యార్థి, నిరుద్యోగ వివిధ రంగాల సాధారణ పౌరులూ రకరకాల కష్టాలు ఎదుర్కొన్నారు. అప్పటి కేసుల వ్యతిరేక ప్రభావం వ్యక్తిగత జీవితాలపై తీవ్రంగా ప్రసరించింది. పాసుపోర్టు వంటివి సమయానికి అందక చెప్పుకోలేని బాధలు చవిచూశారు.అమరులైన వారి 1200 కుటుంబాలు సహా కేసులు, రిమాండ్ అయిన వారి కుటుంబాలూ ఎన్నో వేదనలుపడ్డాయి. అలాంటి వారి కష్టంతో సొంత రాష్ట్రం కల 2014 జూన్ 2న ఎట్టకేలకు నెరవేరింది. ముఖ్యంగా ప్రత్యక్ష ఉద్యమంలో అవిశ్రాంతంగా భాగమైన లెక్కకు అందని పౌరుల్లో జైలు జీవితం గడిపిన వేలాది మంది తమ స్వేదం, త్యాగం వృథా కాలేదని గర్వంగా ఫీలయ్యారు. ప్రధానంగా తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా అధికారిక గుర్తింపు కోరుకున్నారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ ఛాంపియన్ కెసిఆర్ ముఖ్యమంత్రిగా చేయలేనివి ప్రస్తుత సిఎం చేయగలరని చాలా మందిలో నమ్మకం. రేవంత్ రెడ్డి కూడా తమ ప్రజాపాలనలో తన సక్సెస్ సీక్రెట్ అదే కాబోతుందని కడపటి ఎన్నికలకు ముందు నొక్కి చెప్పారు.ఉద్యమ సారథే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి అయినందున ఉద్యమ భాగస్వాములు అందరికీ మేలు జరుగుతుందని అప్పట్లో ఆశించారు. అయితే 2250 కేసుల వరకు ఉపసంహరణో, వీగిపోవడమో మాత్రం జరిగి ఉంటుంది. అమరులైన కుటుంబాల్లో చిట్టచివరి బాధితులనే గుర్తించలేదనే అపప్రద గత పాలకులు మూటగట్టుకున్నారు. కేసులతో జైలుకెళ్లిన ఉద్యమకారులను ఏదో విధంగా ఆదరించేంతటి పుష్కలమైన సమయం రెండు టర్మ్‌ల్లో కావాల్సినంత ఉండింది. కనీసం ఆర్థికేతర ప్రయోజనాలైనా చేకూర్చలేదు. రేవంత్ రెడ్డి పట్టుకున్న అనేక పాయింట్లలో ఇదొకటి. ఉద్యమకారులకు నివేశనా స్థలాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోకి వచ్చిన తొలినాళ్ళలో కేసుల సమాచారం, జైలుకు వెళ్లిన ఉద్యమకారుల వివరాలు సేకరించారు.లాభితులు కాబోయే వారిలో అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలు, నాయకులు, నిరుద్యోగ యువత తదితరులు ఉంటారు. నిధులతో ముడిపడిన ఇతరత్రా మేళ్ళ మాటెలా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి మానస పుత్రిక ప్రతిపాదిత ఆ ఫోర్త్ సిటీలోనైనా రాష్ట్ర వ్యాప్త ఉద్యమకారులు అందరికీ ఒకేచోట ఇళ్ల స్థలాలు కేటాయించాలి. రాష్ట్ర అవతరణ దినోత్సవాన విధాన ప్రకటనతో దీనిపై కార్యాచరణ వెల్లడించాలి. తద్వారా పార్టీలకు అతీతంగా అందరి మన్ననలు పొందాలి. కెసిఆర్ ఈర్ష్య పడేలా వివిధ వర్గాల వారి కృతజ్ఞతలు ఆస్వాదించాలి. అదే సమయంలో మలిదశ ఉద్యమాన (2001–2014) రిపోర్టింగ్ చేసిన తెలంగాణ పాత్రికేయులు అందరికీ పనిలో పనిగా ఔదార్యంతో అక్కడే ప్లాట్లు ఇవ్వాలి. అందరిలా జర్నలిస్టులను కూరలో కరివేపాకుగా పరిగణించే పాలకులం తాము కాదని రుజువు చేయాలి.

# ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

విజయవాడ,ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం అవుతోంది. ఏటా హామీలు తప్ప నియత్రణ జరగడం లేదు. దోపిడా సాగుతున్నా పట్టించుకోని వైనం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంకా తల్లికి వందనం అందలేదు. ఎంత మంది పిల్లల్ని చదివిస్తున్నా అందరికీ తల్లికి వందనం ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికలకు ముందు ప్రకటించారు. పాఠశాలల ప్రారంభం రోజు అంటే జూన్ 12న తల్లుల ఖాతాల్లో ఈ డబ్బులు వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుఇటీవలే ప్రకటించారు. దాని కోసం చాలా మంది తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే సర్కార్ తోడ్పాటుతోనే పిల్లలను చదివించే అవకాశం కలుగుతుంది. ఒక్కో జిల్లాలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు లక్ష మందికి పైగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ లక్షల్లో ఫీజులుకట్టాల్సి ఉంది. నర్సరీ స్థాయి నుంచే ఫీజుల రూపంలో రూ.25 నుంచి రూ.50వేల వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. విద్యార్థి తరగతి పెరిగే కొద్దీ ఫీజుల భారం కూడా పెరుగుతూ పోతోంది. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్స్ ఇలా అన్నింటికీ లక్షల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇంట్లో ఇద్దరు పిల్లల ఉంటే పుస్తకాలు, యూనిఫాం తీసుకోవాలంటే రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇంటర్, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు అయితే వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్, ఫీజులకు రూ.3 లక్షల వరకు ఖర్చు వస్తోంది. టెక్నో, సిబ్యాచ్, నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ తదితర వాటికి మరింత అదనంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇవన్నీ తడిసి మోపెడు అవుతున్నాయి. ఈ ఫీజులను ఎలాగూ నియంత్రించ లేకపోతున్నారు. అందుకే ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురు చూస్తున్నారు. డబ్బున్న వారికి ఇది పెద్ద సమస్య కాకున్నా సామాన్యులు, చిరుద్యోగులకు పెనుభారంగానే మారుతోంది. ఫీజుల నియంత్రణ అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. ఒకప్పుడు విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో విద్యాలయా నికి వెళ్లే వారు. కార్పొరేట్ విద్యా వ్యాపారం రాకతో చదువు ఖరీదైనదిగా మారింది. గడిచిన దశాబ్ద కాలంలో వందలు వేలుగా, వేలు లక్షల్లాగా ఫీజులు పెరిగాయి. కార్పొరేట్ పాఠశాల అంటే చాలు లక్షల్లోనే ఫీజులను రెడీ చేసుకోవాల్సిందే. వారికి కనీసం సామాజిక బాధ్యత లేకుండా దోపిడీకి గురి చేస్తున్నారు. ఎల్‌కెజి, యుకేజీ స్థాయికే ఈ స్థాయిలో డబ్బులను తల్లిదండ్రులతో లాగేస్తున్నారు. తమ పిల్లలు జీవితంలో స్థిర పడాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు వారి కష్టాన్ని మొత్తం ఫీజుల రూపంలో ప్రయివేటు–, కార్పొరేట్‌కు ధారబోస్తున్నారు. ప్రభుత్వం ఫీజులు నియంత్రించాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.

# విమర్శలపై స్పందించిన శశిథరూర్..

న్యూఢిల్లీ,కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. కేంద్రం నియమించిన దౌత్య బృందానికి నాయకత్వం వహించారు. పాకిస్థాన్ వైఖరిని విదేశాల్లో ఎండగట్టేందుకు అధికార–ప్రతిపక్ష ఎంపీల బృందాలను విదేశాలకు పంపించింది.ఇక కాంగ్రెస్‌ను సంప్రదించకుండానే ఆ పార్టీ ఎంపీ శశిథరూర్‌ను కేంద్రం నియమించడంపై వివాదం చెలరేగింది.ఇక విదేశాల్లో భారత్ తరపున పాకిస్థాన్ వైఖరిని విదేశీ నాయకులకు వివరించారు. ఆయన మాటలను కాంగ్రెస్ తప్పుపట్టింది. తాజాగా కాంగ్రెస్ విమర్శలపై శశిథరూర్ స్పందించారు. అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్యంలో విమర్శలు తప్పకుండా ఉంటాయని.. ఈ సమయలో వాటి గురించి ఆలోచించలేమని.. వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం లేదని చెప్పారు.ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్ర దాడి జరిగి 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం భారత్.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఇక పాకిస్థాన్.. ఉగ్రవాదాన్ని ఎలా పెంచి పోషిస్తుందో ప్రపంచానికి తెలియజేయా లని కేంద్రం నిర్ణయించింది. ఏడు దౌత్య బృందాలను ఏర్పాటు చేసి విదేశాలకు పంపించింది. ఇందులో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఒక బృందానికి నాయకత్వం వహించారు. న్యూయార్క్ పర్యటనలో ఉండగా శశిథరూర్ మాట్లాడుతూ.. తాను ప్రభుత్వానికి కాదు.. ప్రతిపక్ష పార్టీకి పని చేస్తున్నట్లు తెలిపారు. అయితే పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత భారత్ ప్రతీకార దాడులకు దిగిందని.. అదే యూపీఏ హయాంలో అలా జరగలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలే కాంగ్రెస్ నేతలకు కోపం తెప్పించింది. ఆ పార్టీ నేత పవన్ ఖేరా.. శశిథరూర్ వ్యాఖ్యలను ఖండిం చారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో కూడా సర్జికల్ స్ట్రైక్ జరిగాయని గుర్తుచేశారు. చౌకబారు రాజకీయాలు చేయడానికే శశిథరూర్‌ను కాంగ్రెస్ ఉపయోగించుకుంటోందని జైరాం రమేష్ మండిపడ్డారు. ఇక మరో నాయకుడు ఉదిత్ రాజ్ స్పందిస్తూ.. శశిథరూర్‌ను బీజేపీ సూపర్ ప్రతినిధిగా నియమించాలని సూచించారు.శశిథరూర్ నాలుగుసార్లు కాంగ్రెస్ నుంచి తిరువనంతపురం నుంచి ఎంపీగా గెలిచారు. కానీ కాంగ్రెస్‌తో సరైన సంబంధాలు లేవు. ఈ మధ్య కాలంలో బీజేపీతో కలిసి మెలిసి ఉంటున్నారు. ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించారు. ఇక కేరళ అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరగనున్నాయి.

# రేషన్‌ వార్..

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ వాహనాలను తొలగించారు.. ఇంటింటికి తీసుకొచ్చి వాహనాల్లో రేషన్ ఇవ్వడం వల్ల ఆర్థికంగా నష్టం వస్తుందని కూటమి ప్రభుత్వం వీటిని తొలగించింది..వీటి స్థానంలో రేషన్ షాపులోనే ఇకనుంచి రేషన్ ఇవ్వనున్నారు. ప్రతి నెల 15 రోజులు పాటు రేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం రెడీ అవుతోంది.. 65 ఏళ్లు దాటిన వృద్ధులు.. దివ్యాంగులకు ఇంటి వద్దకు తెచ్చి ప్రతి నెల 5వ తేదీ లోపు రేషన్ అందిస్తారు.. ఇకనుంచి రేషన్ దుకాణాలను రేషన్ మాల్స్ గా మార్చి మిగిలిన వస్తువులు కూడా అందించడానికి ప్రభుత్వం రెడీ అవుతోంది..గత ప్రభుత్వం పై పౌర సఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రమైన విమర్శలు చేశారు.. గత ప్రభుత్వం రేషన్ వాహనాలను ఉపయోగించడం వల్ల 1700 కోట్లకు పైగా నష్టం వచ్చింది అన్నారు.. అదే విధంగా రేషన్ వాహనాల్లో మాఫియా వల్ల అక్రమ బియ్యం తరలింపు ఆస్కారం కలిగిందన్నారు.. రేషన్ వాహనాలు ఎప్పుడు వచ్చేవో కూడా తెలిసేది కాదన్నారు.. ఏదో ఒక మూల వాహనాన్ని పెట్టి కొంతమందికి రేషన్ ఇచ్చి వెళ్లిపోయే వారిని విమర్శలు చేశారు.. దీంతో ఖజానాకు నష్టం కాకుండా అక్రమ బియ్యం తరలింపు అస్కారాలు ఏర్పడింది అన్నారు నాదెండ్ల మనోహర్.అయితే, రేషన్ వాహనాలు తొలగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వైసీపీ తీవ్ర స్థాయిలో మండిపడింది.. వృద్ధులకు వికలాంగులకు దివ్యాంగులకు ఈ నిర్ణయం వల్ల తీవ్రమైన ఇబ్బంది కలుగుతుంది అన్నారు మాజీ మంత్రి, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ . ప్రభుత్వం తీసుకున్న అనాలోచితం నిర్ణయాల వల్ల నష్టం జరుగుతుందన్నారు.. మరో మాజీ మంత్రి అంబటి రాంబాబు కూడా తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.. రేషన్ వాహనాల్లో డ్రైవర్లు 70 నెలల కోసం గత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు అని.. అర్థాంతరంగా తొలగించడం ఎంతవరకు సమంజసం అన్నారు. గత ప్రభుత్వం లో బియ్యం అక్రమ రవాణా జరిగిందని అనవసర విమర్శలు చేయడం మంచిది కాదన్నారు

# ఈ ఏడాదిలో జగన్ ఎంతవరకు సక్సెస్ అయ్యారు?



అమరావతి,ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుంది. ఈనెల నాలుగున నాటికి ఏడాది పూర్తవుతుంది. జూన్ 12న కూటమి అధికారం చేపట్టింది. అయితే ఈ ఏడాది కాలంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి విమర్శలు చేస్తున్నారు. అందుకే కూటమికి ఫలితాలు వచ్చిన జూన్ 4న వెన్నుపోటు దినంగా జరుపుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆరోజున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు ఆ పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. అయితే ఏడాది కూటమి పాలన ను అటుంచితే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఎంతవరకు విపక్ష నేతగా సక్సెస్ అయ్యారు అన్నది ఇప్పుడు ప్రశ్న. ఆయనకు ప్రతిపక్ష హోదా రాలేదు. అయినా సరే ఒక పార్టీ అధినేతగా.. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి కావడంతో.. ఆయన పనితీరు కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఏడాదిలో ఆయన ప్రజా సమస్యలపై పోరాటం చేసే ప్రతిపక్ష నేతగా ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోయారన్న విమర్శ ఉంది. అయితే దారుణ పరాజయం నుంచి బయటపడి పార్టీని లైన్లోకి తీసుకురావడంలో మాత్రం ఎంతో కొంత సక్సెస్ అయినట్టు కనిపించారు.

**అదో విలక్షణ తీర్పు..**

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏపీ ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారు. టిడిపి కూటమికి ఏకంగా 164 సీట్లు కట్టబెట్టారు. అప్పటివరకు అధికారంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. విపక్ష హోదా లేని నేతగా జగన్ ని ఉంచారు. జగన్ పొలిటికల్ కెరీర్లో ఇదో వింత అనుభవం కూడా. అయితే 2014 నుంచి 2019 మధ్య విపక్ష నేతగా ఉండేటప్పుడు జగన్ దూకుడుగా ఉండేవారు. ఆ దూకుడే 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేగలిగింది. అయితే మునుపటి దూకుడు జగన్మోహన్ రెడ్డిలో ఇప్పుడు కనిపించడం లేదు. ఇది ముమ్మాటికి ఆయనతోపాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనస్. అయితే తనకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతానని ముందుగానే అస్త్ర సన్యాసం చేశారు జగన్మోహన్ రెడ్డి. శాసనసభ్యుడిగా ప్రమాణం చేసిన సమయంలో కూడా తడబడ్డారు. గత అనుభవాల దృష్ట్యా తనకు దారుణ అవమానాలు ఉంటాయని భావించి ఏకంగా అసెంబ్లీని బాయ్ కట్ చేశారు. అది మాత్రం ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. జగన్మోహన్ రెడ్డికి మైనస్ గా మారింది.


**కనీసం చంద్రబాబు మాదిరిగా కాకుండా**

2019 ఎన్నికల్లో చంద్రబాబునేతృత్వంలోని టిడిపి దారుణ పరాజయం చవిచూసింది. అయితే నాడు కేవలం 23 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో అడుగు పెట్టారు చంద్రబాబు. తొలినాళ్లలో గట్టిగానే పోరాటం చేశారు. వైసీపీ సభ్యుల నుంచి హేళనలు, విమర్శలను తట్టుకున్నారు. ప్రజా సమస్యలపై గట్టిగానే పోరాటం చేశారు. అయితే చంద్రబాబు కుటుంబం పై వ్యక్తిగత దాడి చేయడంతో తీవ్ర అవమానంగా భావించారు. మళ్లీ సభలో సీఎంగానే అడుగు పెడతానని శపథం చేశారు. అయితే చంద్రబాబు అవమానాలను ఎదుర్కొన్న తీరు ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. అప్పట్లో ఆయన శాసనసభను బహిష్కరించినా తప్పు పట్టిన వారు తక్కువ. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి అలా కాదు. ప్రారంభంలోనే ఆయన శాసనసభను బహిష్కరించారు. అయితే కేవలం వైసీపీ హయాంలో ప్రత్యర్థులను టార్గెట్ చేసుకున్నారు.. అదే ఫార్ములా ఇప్పుడు తనపై అప్లై చేస్తారని తెలిసి జగన్ శాసనసభను బహిష్కరించారని ప్రజలు ఒక అంచనాకు వచ్చారు. జగన్ తీరును తప్పు పడుతున్న వారే అధికంగా ఉన్నారు.

**ప్రజల్లోకి వచ్చింది తక్కువ..**

ఈ ఏడాది కాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రజల్లోకి వచ్చింది చాలా తక్కువ. ఎక్కువ సమయం బెంగళూరులోని ఎలహంకా ప్యాలెస్ లోనే గడిపేవారు. అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి ప్యాలెస్ గడప దాటేవారు కాదన్న విమర్శలు ఉండేవి. ఇప్పుడు మాత్రం బెంగళూరు కే పరిమితమైపోతున్నారన్న టాక్ వినిపిస్తోంది. సంక్రాంతి కంటే ముందే జిల్లాల పర్యటనకు వస్తానని జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. కానీ అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్ప.. ప్రజల్లోకి మాత్రం రాలేకపోయారు. పార్టీ శ్రేణుల్లో ఇది నిరాశ నింపుతోంది. మరోవైపు పార్టీ నుంచి కీలక నేతలు బయటకు వెళ్ళిపోతున్న నిలువరించే ప్రయత్నం జరగలేదు. ఇది కూడా జగన్మోహన్ రెడ్డికి మైనస్ గా మారింది. మొత్తానికైతే కూటమి ఏడాది పాలనను తప్పు పడుతున్న జగన్మోహన్ రెడ్డిని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సైతం మార్కులు వేయడం లేదు. తొలి ఏడాది విపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నిరాశే మిగిలింది.

# విజయసాయి రెడ్డి రీఎంట్రీ...



అమరావతి, ఏపీ రాజకీయాల్లో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మరోసారి చర్చకు తెర లేపారు. ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమై దాదాపు 6 నెలలు అవుతోంది. ఆ పార్టీ ద్వారా వచ్చిన రాజ్యసభ పదవికి సైతం ఆయన రాజీనామా చేశారు. మూడేళ్ల పదవికి గుడ్ బై చెప్పి పార్టీ నుంచి బయటకు వచ్చారు. ఆయన రాజీనామా చేసిన స్థానానికి ఉప ఎన్నిక కూడా జరిగిపోయింది. అయితే కూటమికి అమ్ముడుపోయారని.. చంద్రబాబుకు లొంగిపోయారని ఇటీవల జగన్మోహన్ రెడ్డి విజయసాయి రెడ్డి పై సంచలన ఆరోపణలు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం కూడా అదే పనిగా విజయసాయిరెడ్డి పై విమర్శలు చేస్తూనే ఉంది. కానీ విజయసాయిరెడ్డి నుంచి ఆ స్థాయిలో రియాక్షన్ లేదు. పైగా జగన్మోహన్ రెడ్డిని విమర్శించని.. ఇకపై కూడా విమర్శించబోనని విజయసాయిరెడ్డి మరో సంచలనానికి తెర తీశారు.

**బిజెపి పెద్దలతో సాన్నిహిత్యం..**

జనవరిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీక రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. సరిగ్గా జగన్మోహన్ రెడ్డి విదేశాల్లో ఉండగా తన నిర్ణయాన్ని ప్రకటించారు. తరువాత ఆయన రాజ్యసభ పదవికి కూడా రాజీనామా చేశారు. ఇకనుంచి రాజకీయ సన్యాసం చేస్తానని.. వ్యవసాయం చేసుకుంటానని చెప్పారు. అయితే తరచూ రాజకీయాల గురించి మాట్లాడేవారు. రాజకీయ వ్యాఖ్యానాలు చేసేవారు. దీంతో ఆయన తిరిగి రాజకీయాల్లోకి వస్తారని.. బిజెపిలో చేరతారని పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. బిజెపి పెద్దలతో విజయసాయి రెడ్డికి మంచి సాన్నిహిత్యం ఉంది. అందుకే ఆయన బిజెపిలో చేరడం ఖాయమని ప్రచారం జరిగింది. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది. అయితే ఇప్పుడు ఆయన మనసు మార్చుకున్నట్లు ప్రచారం సాగుతోంది. అందులో భాగంగానే జగన్మోహన్ రెడ్డి విషయంలో సానుకూల ప్రకటనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**మద్యం కుంభకోణంలో ఆరోపణలు..**

ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో భారీగా మద్యం కుంభకోణం జరిగిందని కూటమి ప్రభుత్వం అనుమానించింది. ప్రాథమిక ఆధారాల సేకరణ, కేసు నమోదు తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించింది. ఈ కేసులో ఏ 5 నిందితుడిగా విజయసాయిరెడ్డి ఉన్నారు. అయితే ఈ మొత్తం మద్యం కుంభకోణంలో రాజ్ కసిరెడ్డి సూత్రధారి అని సంచలన ఆరోపణలు చేశారు విజయసాయిరెడ్డి. తనకు అనుమతి ఇస్తే పూర్తిస్థాయి ఆధారాలు కూడా ఇస్తానని సిట్ కి ఆఫర్ ఇచ్చారు. విచారణకు కూడా హాజరయ్యారు. తరువాత కీలక అరెస్టులు జరిగాయి. తదుపరి అరెస్టు జగన్మోహన్ రెడ్డి దేనని ప్రచారం నడిచింది. ఈ పరిస్థితుల్లో జగన్ మీడియా ముందుకు వచ్చారు. విజయసాయి రెడ్డి పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే విజయసాయిరెడ్డి ప్రత్యేక ప్రకటన ఇచ్చారు కానీ.. జగన్ పై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. కోటరీ వల్లే తాను జగన్కు దూరమయ్యానని.. ఆయనపై ఒక్క వ్యాఖ్య కూడా చేయనని తేల్చి చెప్పారు విజయసాయిరెడ్డి. అయితే బిజెపిలో వెళ్లేందుకు దారులు మూసుకుపోవడం వల్లే ఇప్పుడు జగన్ విషయంలో విజయసాయిరెడ్డి సానుకూలతగా మాట్లాడుతున్నారని అనుమానాలు ఉన్నాయి.

**బిజెపిలో చేరుతారని ప్రచారం..**

వాస్తవానికి బిజెపి లైన్లో విజయసాయిరెడ్డి ఉన్నారని తెగ ప్రచారం నడిచింది. బిజెపి పెద్దలతో ఉన్న అనుబంధంతో ఆయన ఆ పార్టీలో చేరుతారని కూడా టాక్ నడిచింది. కానీ ఏపీలో కూటమి పెద్దల అభ్యంతరాలతో బిజెపి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. మరోవైపు వైయస్సార్ కుటుంబంతో మూడున్నర దశాబ్దాల అనుబంధం విజయసాయిరెడ్డికి. కేవలం కోటరీ వల్లే తాను జగన్కు దూరమయ్యానని పలుమార్లు చెప్పారు విజయసాయిరెడ్డి. ఇప్పటికే తాను టిడిపిలో చేరడానికి కూడా ప్రకటించారు. అటు బిజెపి చేర్చుకోకపోవడంతో జగన్ పిలిస్తే తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉండడంతో.. విజయసాయిరెడ్డి జగన్ కు సంకేతాలు పంపుతున్నారన్న అనుమానాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# మీ ఎమ్మెల్యే పనితీరు ఎట్లుంది?.. నియోజక వర్గాల వారీగా ఓటర్లకు ఫోన్ కాల్స్



హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ఎమ్మెల్యేల పనితీరు తెలుసుకునేందుకు సర్వే జరుగుతున్నది. నియోజకవర్గాలవారీగా ఓటర్లకు ఫోన్ కాల్స్ వెళ్తున్నాయి. “మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది?” అని అడుగుతూ, ‘బాగుంది, పర్వాలేదు, బాగాలేదు, చెప్పలేం’ అనే 4 ఆప్షన్లతో సమాధానాలు సేకరిస్తున్నారు. కానీ, ఈ సర్వే ఎవరు చేస్తున్నారు? అనే సంగతి తెలియక ఎమ్మెల్యేలు గందరగోళంలో ఉన్నారు. ప్రభుత్వమే థర్డ్? పార్టీ ఏజెన్సీతో సర్వే చేయిస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాదిన్నర కావస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఎంత సమర్థవంతంగా పనిచేశారు? స్థానిక సమస్యలను పరిష్కరించడంలో, అభివృద్ధి పనులను చేపట్టడంలో వారి పాత్ర ఎలా ఉంది? ఎమ్మెల్యేలు ప్రజలతో ఎంతవరకు అనుసంధానమయ్యారు? స్థానిక అవసరాలను ఎలా తీర్చారు? ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఎంతవరకు చేరవేశారు? అనే అంశాలను తెలుసుకునేందుకు ఈ సర్వే చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరుతోపాటు అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని కూడా అంచనా వేయవచ్చనే కోణంలోనే ఈ సర్వే చేస్తున్నట్టు చర్చ నడుస్తున్నది. ఒకవేళ ఎమ్మెల్యేల పనితీరు బాగున్నా, ప్రభుత్వంపై అసంతృప్తి ఉన్నట్లు సర్వేలో తేలితే.. అది పార్టీ హైకమాండ్ కు కీలక సంకేతంగా మారనుంది. అదే సమయంలో, ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేకపోతే, దాని ప్రభావం ప్రభుత్వ ఇమేజ్పై పడే అవకాశం ఉంది. స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో ఈ ఫోన్? కాల్? సర్వే కీలకంగా మారింది. ఇప్పటికే సీఎం రేవంత్? రెడ్డి ఎమ్మెల్యేలతో వన్?టు వన్? భేటీ అవుతూ ఫీడ్? బ్యాక్? తీసుకోవడమే కాకుండా ఎమ్మెల్యేల ప్రోగ్రెస్? పైనా చర్చిస్తున్నారు. హైదరాబాద్లో కాకుండా తమ నియోజకవర్గాల్లోనే ఉండాలని ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆదేశాలిచ్చారు. స్థానిక ఎన్నికలు దగ్గరలో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు ప్రజలతో మమేకం కావాలని, స్థానిక సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించినట్లు తెలుస్తున్నది. ఈ ఆదేశాలతో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో యాక్టివ్గా కనిపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమావేశాలు, పట్టణాల్లో ప్రజలతో సమస్యలపై చర్చలు, అభివృద్ధి పనుల పరిశీలన వంటివి చేస్తూ బిజీగా గడుపుతున్నారు.

**ఎమ్మెల్యేల్లో ఆందోళన**

సర్వే గురించి స్పష్టత లేకపోవడంతో ఎమ్మెల్యేల్లో కొంత ఆందోళన నెలకొన్నది. తమ పనితీరుపై ఓటర్లు ఏం చెబుతారు? ఈ సర్వే ఫలితాలు పార్టీ హైకమాండ్కు చేరుతాయా? అనే ఆలోచనలు వారిని వెంటాడుతున్నాయి. ముఖ్యంగా, గత ఎన్నికల్లో తక్కువ మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యేలు లేదా నియోజకవర్గంలో వివాదాలు ఎదుర్కొన్న వారు ఈ సర్వే ఫలితాలపై ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ సన్నిహితుల ద్వారా సర్వే గురించి సమాచారం సేకరిస్తున్నారు. ఓటర్లు ఏ ఆప్షన్ ఎంచుకుంటున్నారు? తమ పనితీరుపై ప్రజల అభిప్రాయం ఏమిటి? అని తెలుసుకునే పనిలో పడ్డారు. కాగా, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల్లో అధిక సీట్లు సాధిస్తే, అది అధికార పార్టీకి ఊపు తెచ్చే అంశం. అందుకే, ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేల పాత్ర చాలా కీలకం. వారి నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత ఎమ్మెల్యేలపై ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేయడం ద్వారా పార్టీ హైకమాండ్, ప్రభుత్వం తమ ప్రణాళికలను అమలు చేసేందుకు వీలవుతుందని అంచనా వేస్తున్నట్టు తెలుస్తున్నది. మరోవైపు స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ కూడా బలంగా పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తమ ఎమ్మెల్యేల సామర్థ్యాన్ని ముందుగానే అంచనా వేసి, అవసరమైన చోట పనిచేయించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇకపై రేషన్ బియ్యానికి బదులుగా డబ్బులు..



అమరావతి, ప్రభుత్వం రేషన్ బియ్యం బదులుగా రేషన్ కార్డు లబ్ధిదారులకు నగదు లేదా వాటి స్థానంలో ఇతర ధాన్యాలు కూడా ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. కూటమి సర్కార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సమయం నుంచి ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు అడుగులు వేస్తుంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం గత పాలనలో ఉన్న వైసిపి ప్రభుత్వం తీసుకుని వచ్చిన పలు విధానాలకు స్వస్తి పలికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల కోసం వినూత్నమైన ఆలోచనలను చేస్తూ సరికొత్త విధానాలతో ముందుకు వెళుతుంది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రేషన్ పంపిన విధానంలో కూడా సరికొత్త మార్పులను చేపట్టింది. రేషన్ కార్డు కలిగి ఉన్న వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక శుభవార్త తెలిపింది. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేషన్ పంపిణీ విధానంలో కొన్ని కీలకమైన మార్పులను చేపట్టింది. కొంతమంది రేషన్ కార్డు ద్వారా తమకు అందే బియ్యాన్ని చాలా తక్కువ ధరకు వేరే వారికి అమ్ముతున్నారు. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న ఏపీ ప్రభుత్వం ఇకపై రేషన్ బియ్యం తీసుకోవడానికి ఇష్టపడని లబ్ధిదారులందరికీ ఆ బియ్యానికి ప్రత్యామ్నాయంగా నగదు ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఈ విషయాన్ని స్వయంగా తెలిపారు. ఆదివారం రోజు కృష్ణాజిల్లా మచిలీపట్నం నియోజకవర్గంలో రాజపేట గ్రామంలో ఓ చౌక ధరల దుకాణాన్ని సందర్శించి మంత్రి కొల్లు రవీంద్ర రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి కొల్లు రవీంద్ర పాలనలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రేషన్ వ్యవస్థ పూర్తిగా చెరిగిపోయినట్లు మండిపడ్డారు. పేద ప్రజల కోసం రేషన్ ద్వారా అందిస్తున్న బియ్యం మాఫియా చేతిలో పడిపోయింది. ఇంటింటికి రేషన్ సరుకులు పేరుతో రేషన్ కార్డు కలిగి ఉన్న వారందరిని సమస్యల లోకి నెట్టేశారు. ఆ సమయంలో వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం జరిగింది అంటూ ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో పాలనలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం మళ్లీ చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ పున ప్రారంభించిందని మంత్రి చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వచ్చిన కొత్త విధానం లో ప్రతినెల ఇకపై ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా రేషన్ సరుకులు అందుబాటులో ఉంటాయి. ఇది ప్రజలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుంది అని మంత్రి తెలిపారు. నెలలో ఎవరికైనా ఏదైనా సమస్య వచ్చినా కూడా వాళ్లకు 15 రోజుల గడువు ఉంటుంది. గతంలో రేషన్ తేదీలపై స్పష్టత లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చేది. కానీ ఇప్పుడు ఇలాంటి ఇబ్బందులు ఉండవు అంటూ మంత్రి వివరించారు.

# అంబేద్కర్ వర్సిటీకి ఏపీ బాకీ 600 కోట్లు!



హైదరాబాద్,బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి ఏపీ సర్కారు మొండిచేయి చూపినట్టే కనిపిస్తున్నది. వర్సిటీకి బకాయిపడ్డ రూ.600 కోట్లు చెల్లించడం అనుమానమేనని విద్యావేత్తలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఏపీ నుంచి నిధులు రాబట్టే విషయంలో తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు మౌనం వహించడమే ఇందుకు కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తెలంగాణ తీవ్రంగా నష్టపోతున్నదని అధికారులు చెప్తున్నారు. అంబేద్కర్ వర్సిటీని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 10వ షెడ్యూల్లో చేర్చారు. చట్టం ప్రకారం పదేండ్ల పాటు తెలంగాణ ప్రభుత్వం 48శాతం, ఏపీ సర్కారు 52శాతం నిధులను వర్సిటీకి కేటాయించాలి. కానీ ఇంతవరకు ఏపీ ప్రభుత్వం రూపాయి కూడా చెల్లించలేదు.

ఇదే విషయంపై వర్సిటీ అధికారులు ఏపీ ప్రభుత్వానికి చాలాసార్లు లేఖలు రాసినా స్పందన రాలేదు. వర్సిటీకి ఏపీలో 76 స్టడీ సెంటర్లుండగా ఏటా 50వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటున్నారు. పదేండ్లుగా ఉద్యోగుల జీతాలు, పాఠ్యపుస్తకాలు, తరగతులు, పరీక్ష నిర్వహణ, సర్టిఫికెట్లు జారీ ఖర్చును తెలంగాణ ప్రభుత్వం, వర్సిటీ భరించింది. ఇందులో ఏపీ చెల్లించాల్సిన బకాయి మొత్తం రూ. 600 కోట్లుగా ఉంది. విభజన చట్టం ప్రకారం 2024-25 విద్యాసంవత్సరంతో గడువు ముగిసింది. ఇప్పటివరకు వర్సిటీ విభజన పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో ఏపీలోని విద్యార్థులకు ఏపీలోని వర్సిటీ ఉద్యోగులకు వేతనాలు, ఏపీ విద్యార్థులకు ప్రవేశాలు నిలిపివేసింది. మరోవైపు ఏపీ ప్రభుత్వం వర్సిటీ హెడ్క్వార్టర్స్ను ఏలూరుకు తరలిస్తున్నట్టు వివాదాస్పద జీవో విడుదల చేసింది. యూజీసీ నిబంధనల ప్రకారం వర్సిటీలు వాటి ప్రాదేశిక పరిధి(రాష్ట్రం)లోనే సేవలందించాలి. ప్రస్తుతం వర్సిటీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్లో ఉంది. ఈ లెక్కన వర్సిటీ హెడ్క్వార్టర్ను ఎలా మార్చుతారన్న ప్రశ్నలొస్తున్నాయి. తెలంగాణ సర్కారు నిర్లక్ష్యం చేయకుండా ఏపీ ప్రభుత్వం నుంచి బకాయిలు వసూలుకు చర్యలు తీసుకోవాలని వర్సిటీ ఉన్నతాధికారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా వేలాది మంది భక్తులు...

జమ్ము కశ్మీర్: జమ్ము: దేశవ్యాప్తంగా ఉన్న భక్తులు మాతా కీ భవానీని సందర్శించడానికి చేరుకున్నారు. ఈ ఉత్సవం జూన్ 3న ముగియనుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత, ఇంత పెద్ద కార్యక్రమానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది, భద్రతా చర్యలు కూడా చేసింది. ఈ ఉదయం గట్టి భద్రత మధ్య జమ్మూ నుండి ఒక బృందం కాశ్మీర్కు బయలుదేరింది. ఈ ఉత్సవం కేవలం మతపరమైన పండుగ మాత్రమే కాదు, నిర్వాసిత సమాజం తమ మూలాలతో కనెక్ట్ అవ్వడానికి కూడా ఒక అవకాశం. క్షీర్ భవానీకి చేరుకున్న భక్తులు తమ ప్రియమైన దేవత పాదాల వద్ద నివాళులు అర్పించే అవకాశం ఇదని అంటున్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత కాశ్మీర్లో పర్యాటకం మందగించింది. అయితే పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని, భక్తితో పాటు పర్యాటకం కూడా మళ్లీ పుంజుకుంటుందని భావిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత కాశ్మీర్లో ఇంత పెద్ద మతపరమైన ఉత్సవం జరుగుతుందనేది నిజం. 1990లలో ఉగ్రవాదం కారణంగా తమ ఇళ్ల నుండి నిర్వాసితులైన కాశ్మీరీ పండిట్లకు, ఈ యాత్ర కేవలం మతపరమైన చిహ్నంగానే కాకుండా భావోద్వేగ, సాంస్కృతిక పునరేకీకరణకు కూడా చిహ్నంగా మారింది. మాతా భవానీపైనే కాకుండా భారతదేశ భద్రతా వ్యవస్థపై కూడా తమకు పూర్తి విశ్వాసం ఉందని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ, కాశ్మీరీ పండిట్ల విశ్వాసం సడలలేదని వారు అంటున్నారు. మాత పట్ల వారి భక్తి మునుపటిలాగే బలంగా ఉంది. అలాగే, ప్రభుత్వం-భద్రతా దళాలు యాత్ర భద్రత కోసం తగిన ఏర్పాట్లు చేశాయని, కాబట్టి వారికి ఎలాంటి భయం లేదని చెబుతున్నారు. ఈ యాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జమ్మూలోని రిలీఫ్ కమిషనర్ మైగ్రెంట్స్ తెలిపారు. యాత్రికుల బస, ఆహారం, భద్రత కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన అన్నారు. ఈసారి కూడా వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ మత సంప్రదాయం పట్ల భక్తులలో అపారమైన ఉత్సాహం కనిపించింది. ఈ ఉత్సవం మతపరమైన భావోద్వేగానికి చిహ్నం మాత్రమే కాదు, కాశ్మీరీ పండిట్ల సాంస్కృతిక గుర్తింపు, పునరావాసం వైపు కూడా ఒక ముఖ్యమైన అడుగు. అయితే, భయం కారణంగా ఈసారి తుల్ములాలో ఉన్న క్షీర్ భవానీ ఆలయానికి పూజల కోసం వెళ్లలేని కాశ్మీరీ పండితులు జమ్మూలో నిర్మించిన మాతా రఘేనియా ఆలయంలో పూజలు చేస్తున్నారు. జూన్ 3న వేలాది మంది కాశ్మీరీ పండితులు, ముస్లింలు క్షీర్ భవానీ ఉత్సవంలో పాల్గొంటారు. జమ్మూలోని భవానీ నగర్లోని మాతా రఘేనియా ఆలయంలో జ్యేష్ఠ అష్టమి నాడు క్షీర్ భవానీ ఉత్సవం కూడా జరుగుతుంది. కాశ్మీర్కు వెళ్లలేని వారు ఇక్కడికి వచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. జాతరకు సన్నాహాలు ఇక్కడ ప్రారంభమయ్యాయి. మొత్తం ఆలయ సముదాయాన్ని అలంకరించారు. అక్కడ వందలాది దీపాలను వెలిగించడానికి ఏర్పాట్లు చేశారు. పనున్ కాశ్మీర్ అధిపతి వీరేంద్ర రైనా మాట్లాడుతూ, 1990లో లోయ నుండి స్థానభ్రంశం చెందిన కాశ్మీరీ పండితులు జమ్మూకు వచ్చినప్పుడు, వారు భవానీ నగర్లో మాతా క్షీర్ భవానీ ఆలయాన్ని నిర్మించారని, ఇప్పుడు ఇక్కడ ప్రతి సంవత్సరం ఒక జాతర జరుగుతుందని అన్నారు.



Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**